జూన్ - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరములు :

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

మా చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| బర్నబా | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| బైబిల్ కథలు | మామయ్య కథలు<br>రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 09 |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| స్ముర్న సంఘము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 15 |
| నేను ప్రభువును వదలలేదు | సాక్ష్యము | 19 |
| పరలోకము అనగానేమి? | రెవ. ఎ. మత్తయి, వినుకొండ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |

India Evangelistic & Relief Fellowship

**EVANGELISM**
Church Planting
Evangelestic, Crusades
Pastor's Seminars
Youth Ministry
T.V.Ministry
Magazine Ministry
Audio Ministry
Jail & Prison Ministry
IERF International
Hanna Women Ministries

**RELIEF**
Orphanage
Child Development Centers
Education (U.C.L.I. Schools)
Widows & Leprosy Care
Medical Assistance
Help in Natural Calamity
Flood Relief
Mobile Medical Ministry
Children Care Ministry

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు ప్రభువు నామమున శుభాభివందనములు.

దేవుని మహా కృపనుబట్టి, మీ ప్రార్థనలనుబట్టి నేను, నా భార్య రేచల్ అమెరికా పర్యటన దిగ్విజయముగా ముగించుకొని ఇంకొ రెండు రోజుల్లో ఇండియా దేశమునకు బయలుదేరుతున్నాము. అమెరికా దేశములోని అనేక రాష్ట్రములలో దేవుడు మమ్ములను బలముగా వాడుకున్నందుకు ఆయన నామమునకు సోత్రము చెల్లిస్తున్నాము. చాలా సంఘములలో వాక్యపరిచర్య జరిగించటం ద్వారా అనేక మంది బలపడ్డారు. మా ప్రభువు సంఘములలోని బిడ్డలు మా పర్యటన గురించి దివారాత్రములు చేసిన ప్రార్థన ఫలితంగా దేవుడు మమ్మును గొప్పగా వాడుకున్న విధమునకై వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సంతోషకరమైన విషయం ఏంటంటే, చాలాకాలంగా మేము చేస్తున్న ప్రార్థన ఫలితంగా దేవుడు కొంతమంది సహోదరులను ప్రేరేపించి 'హోలి బైబిల్ స్కూల్' ప్రారంభించుటకు కృప చూపించిన విధమునకై దేవుని కృతజ్ఞతలు చెల్లించుచున్నాను. మత్తయి 10:37లో 'కోత విస్తారమేగాని పనివారు కొద్దిగా ఉన్నారు' అని యేసుప్రభువు వారు చెప్పినట్లు, నేటి దినములలో దేవుని వాక్యము బోధించుటకు అనేకమంది పనివారు అవసరమైయున్నారు. మరి అలాంటి పనివారిని తయారు చేయుటకు దేవుడు 'హోలి బైబిల్ స్కూల్' ద్వారా మాకు ఇచ్చిన అవకాశాన్ని దేవుని నామ మహిమార్థముగా జరిగించునట్లు ప్రార్థించండి. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన మీ బిడ్డలను మా 'హోలి బైబిల్ స్కూల్' ద్వారా దేవుని పనికి తర్ఫీదు పొందుటకు చేర్పించండి. ఆగష్టు 1వ తేది నుండి ప్రారంభించబడే తరగతులకు కేవలం 15 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది కాబట్టి ఆసక్తి గలవారు వెంటనే మమ్మును సంప్రదించండి. వివరములకు ఈ పత్రికలో ప్రచురించ బడిన ప్రకటను చూడండి. దేవుడు మిమ్మును దీవించును గాక!

-ఎడిటర్

సీరియల్

# బర్నబా

1

## (అపొస్తలుడు రెండవభాగం)

- కొడవటికంటి

ఉదయాన్నె పెందలకడనే బయలుదేరవలసిన ఓడ రేవులోనే నిలచిపోయింది. బర్నబా ఓడ పైభాగమున నిలబడి చూస్తున్నాడు. సూర్యోదయమునకు పూర్వమే సిసారియా రేవు అంతా కోలాహలముగా మారిపోయింది. రేవులో బయట నిలచి ఉన్నాయి. అవి రేవు చేరవలచి వున్నా, రేవు వదలవలసినవయినా అన్నీ ఈ సిసారియా రేవులో ఇరువైపులా సర్దుకొని రేవులో ప్రవేశించనున్న అగ్రిప్పరాజు యొక్క అందమైన ఓడకు స్వాగతం పలుకు తున్నట్లుగా వేచియున్నవి.

రేవు కార్యాలయమంతా సైనికులతో నిండియున్నది. అందరి దృష్టి పడమటి వైపున సముద్రము మీదనే. ఏ క్షణాన్నైనా అగ్రిప్ప ఓడ కనబడుతుందని, సిసారియా పట్టణమంతా ముస్తాబయ్యింది. ఇదేమి పట్టనట్లుగా సూర్యుడు తన ప్రయాణంలో నిమగ్నమై పోయాడు.

బర్నబా ఓడలో హడావిడిగా తిరుతున్న ఓడ పనివారిని చూస్తూ ఉన్నాడు. వీళ్లకి రాజులు మారినా ఒకటే. వీరి జీవితాలలో ఏ మార్పులు రావు. ఈ పని వారిలో ఎక్కువ మంది బానిసలే.

ఎనిమిది సంవత్సరాల క్రితం తన స్నేహితుడైన సౌలును తార్సు పట్టణానికి సాగనింపడానికి వచ్చినప్పుడు, ఈ అగ్రిప్ప రోమా పట్టణానికి ప్రయాణ మయినప్పుడు ఈ సిరియా పట్టణములోనున్న ధనవంతులలో అతడు ఒక ధనవంతుడు మాత్రమే. అతని యోగ్యతల్లా మహా హేరోదు రాజునకు మనుమడై పుట్టటమే.

రోమా చేరిన తర్వాత తల మునిగే అప్పులు చేసి అప్పుల వాళ్లని తప్పించుకొని తిరిగే రోజుల్లో కలిగుల్లా చక్రవర్తికి తెలివితేటలతో పాటు అందం ఆకర్షణ ఉన్న అగ్రిప్ప చేరువయ్యాడు. అంతటితో అగ్రిప్ప అప్పులన్ని తీరిపోయాయి. మరణించిన హేరోదు ఫిలిప్పు యొక్క రాజ్యానికి రాజు అనే బిరుదుతో అగ్రిప్ప పాలస్తీనా తిరిగి వచ్చాడు. హేరోదు అంతిపా రెండవ భార్యకు ఇదేమి నచ్చలేదు. వెంటనే భర్తని పురమాయించి రోమా పట్టణానికి ప్రయాణం కట్టించింది. సీజరు కలిగుల్లాతో హేరోదు అగ్రిప్పకు రాజు బిరుదు ఇవ్వటం అన్యాయం అని చెప్పాలనుకుంది. అయితే ఆమె అగ్రిప్పకు ఏమాత్రం పోటీ కాదు. హేరోదు హేరోదియ పాలస్తీనా అంతా ఆయుధాలతో నింపారని చక్రవర్తికి అగ్రిప్ప వర్తమానం పంపించాడు. అంతే, దాని పర్యవసానం, హేరోదు అంతిపా, అతని భార్యగా చలామణి అవుతున్న అతని సహోదరుని భార్య హేరోదియకు దేశ బహిష్కరణ వారి ఆస్తులు జప్తు ప్రాప్తించినవి.

అగ్రిప్ప చరిత్ర తెలిసిన వారందరు చాలా అదృష్ట వంతుడు అన్నారు. అతని శత్రువులందరు పతనమై పోయారు. అన్నింటికి మించిన అదృష్టం ఏమిటంటే గత సంవత్సరము జనవరి ఇరువది నాలుగున హేరోదు అగ్రిప్ప రోమా పట్టణంలో ఉన్నప్పుడు సీజరు కలిగుల్లా యొక్క శవం ముప్పయి కత్తిపోట్లకు గురైంది. తర్వాత అతని వారసుని వెతకటం మొదలైంది. పిరికివాడైన క్లౌదియ భయపడి పరదా వెనకాల దాక్కున్నాడు. కాని తన పాదాలు బయట వారికి కనబడుతున్నాయని అతను గ్రహించలేదు. సైనిక అధికారులలో ఒకడు ఆ కాళ్ళు పట్టుకొని క్లౌదియను బయటకు లాగి ఇదుగో చక్రవర్తి వారసుడు అని ఎగతాళిగా అరిచాడు. అయితే హేరోదు అగ్రిప్ప ఈ సంఘటనను సరదాగా తీసికోలేదు వెంటనే రాజ్యసభకి వెళ్లి సభ్యులతో మాట్లాడి క్లౌదియను కలిగుల్లా వారసునిగా చేసి ఘనత సంపాదించాడు. అందుకు ప్రతిఫలంగా సీజరు క్లౌదియ, హేరోదు అగ్రిప్పను పాలస్తీనాలోని సమరయ యూదయ సిరియాలకు రాజుగా చేసి ఇప్పుడు పాలస్తీనా

పంపిస్తున్నాడు. అందువల్లే నేడు సిరియా పట్టణం వైభవంగా అలంకరించబడింది.

ఒక్కసారిగా రేవు ఒడ్డున కలకలం రేగింది. దూరంగా సముద్రంలో సూర్యునికి ఎదురు నడుస్తున్న ఓడల సముదాయం. అదే అగ్రిప్ప ఆగమనం. ఓడపై భాగము నుండి చూస్తుంటే సమీస్తున్న ఓడల సముదాయములో అగ్రిప్ప రాజు ప్రయణిస్తున్న ఓడ అలంకరణ అతి రమణీయముగా ఉన్నది. తనను తాను హెచ్చించుకొనుట ప్రారంభించిన మనిషి, తను క్రింద పడిపోయే వరకు తనను తాను ఎంత పెంచుకొనినది తెలియదు. అందుకు దేవుని స్తుతించను లేదు. క్రింద పడిపోయినపుడు మాత్రం తాను ఎంత ఎత్తులో నుండి పడిపోయింది అనుభవంలోనికి వస్తుంది. దేవుడు హెచ్చించిన మనిషి పడద్రోయబడవలసి వస్తే దేవుడు అతనికి దెబ్బ తగలకుండా క్రిందకు దించుతాడు. అందువలన హెచ్చుగా పెరగడానికి మానవ ప్రయత్నం అతని బుద్ధిహీనత మాత్రమే.

హేరోదు ఫిలిప్పు ఇతూరియా, త్రికోనితి దేశములను పరిపాలించినవాడు. అతను తప్పితే మరి ఏ హేరోదు అయినా దేవునికి వ్యతిరేకంగానే నడిచారు. అలాగే ఈ లోకమును విడిచి వెళ్లారు. వారిలో ఇప్పటికి ఆఖరువాడు హేరోదు అంతిపా. ఇతడు బాప్తిస్మమిచ్చు యెహోను తల కొట్టించి ప్రభువు యొక్క శిలువ రోజున ఆయనను తృణీకరించి అపహసించి తన చివరి దినములలో హేరోదియతో కలసి రోమా సామ్రాజ్యములో తను ఎరిగిన వారందరి ముందు అవమానించబడ్డాడు.

ఇప్పుడు ఓడరేవులో సందడి తగ్గిపోయింది. హేరోదు అగ్రిప్ప పట్టణంలోని తన కోటకు వెళ్లిపోయాడు. ఓడ రేవులో నిలిచి యుండిన, బయట వేచియుండిన, ఓడలలో చలనము కలిగినది. సూర్యుడు కిరణాలను నేరుగా తన నొసలు మీదికి పంపిస్తున్నాడు. బర్నబా తన గదిలోలికి వచ్చి కూర్చున్నాడు. ఓడలోని తన గది కిటికీలో నుండి చూస్తే సిసారియా పట్టణం యొక్క సౌందర్యం ఇంకొంచెం పెరిగినట్లుగా అనిపిస్తుంది. ఇదే సాయంకాలం అయితే ఇంకా ద్విగుణీకృతమై యుండేది అనుకున్నాడు. దూరంగా ఆ కొండవాలులో కట్టబడిన మహాహేరోదు విలాస మందిరం. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయం. మహాహేరోదు విలాస మందిరం కట్టించేటప్పుడు తన తర్వాత తన కుమారులలో ఒకరు ఈ విలాస మందిరాన్ని ఉపయోగిస్తారని అనుకున్నాడు. కాని, అతని కుమారులలో ఒక్కరైనా దీనిలో అడుగు పెట్టకుండానే మరణించారు. ఇప్పుడు ఆ మహా హేరోదు మనుమడు అగ్రిప్ప దీనిలో ప్రవేశిస్తాడు కాబోలు అనుకున్నాడు బర్నబా. తన వీపు మీద మెత్తగా తగిలిన చేతి స్పర్శతో ఈ లోకంలోనికి వచ్చాడు.

ఓడ పెద్దగా కూతవేసి మెల్లగా పడమటి సముద్రంలోకి కదలింది. కిటికీ ప్రక్కన ఆసనం చూపిస్తూ "సుమియోను రా కూర్చో" అన్నాడు బర్నబా. తన నల్లని వెంట్రుకలను చెవి ప్రక్కకు నెట్టుకుంటూ కూర్చుని కిటికీలో నుంచి బయటకు చూస్తూ "హేరోదు వంశస్తులు కూడా ఇశ్రాయేలీయులేనా?" అంటూ సంభాషణ కలిపాడు మనయేసు.

"ఎదోమీయులైన వీరిని ప్రభువు రాక పూర్వం నూట అరవై నాల్గవ సంవత్సరంలో జాన్ హెర్కనస్ అనే మెకబీస్ రాజు జయించి అందరికి సున్నతి చేయించాడు. మహ హేరోదు యూదుల మెప్పు కోసం యూదా మతం స్వీకరించినట్లు నటించాడు" అంటూ బర్నబా తన పడక మీద బడలికగా నడుము వాల్చాడు. సుమయోను మనయేసు కిటికీలో నుండి బయటకు చూస్తూ మాట్లాడుకుంటున్నారు. ఓడ ఇప్పుడు ఉత్తరం వైపు ఊపందుకొని ప్రయాణిస్తుంది.

ఇప్పటికి దాదాపు ఎనిమిది సంవత్సరాల క్రితం తన స్నేహితుడైన సౌలును యోరూషలేములోని యూదుల చేతిలో నుండి తప్పిచటానికి తార్సుకు సాగనంప వచ్చిన తను కూడ ఈ దిక్కున ప్రయాణం చెయ్యాల్సి వస్తుందని ఎన్నడూ ఊహించలేదు. అంతియొకయ పట్టణం గురించి విన్నాడేగాని అక్కడికి వెళ్ళవలసి వస్తుందని అనుకోలేదు. శిష్యునిగా చేరకముందు తన యొక్క అపారమైన సంపాదనను సరిచూసుకోటానికే సరిపోయేది. శిష్యునిగా చేరిన

తరువాత తన ఆస్తినంతా ప్రభువునకు సమర్పించి సంఘాన్ని కాపాడుటలో, సంఘాన్ని నడిపించుటలో, హెచ్చరికలు చేయటంలో పది సంవత్సరాలుగడిచి పోయాయి. తన దేశస్థులైన కొందరు కుప్రీయులు అంతియొకయ వరకు సంచారం చేసి అనేకులైన అన్యజనులను ప్రభువు వైపు నడిపించారు. ఇప్పుడు యెరూషలేములోని అపొస్తలులను కలవరపరచిన సంగతి ఏమంటే హెల్లేయులు కాని గ్రీకులు యూదా మతం తెలియని గ్రీకులు యేసును క్రీస్తుగా ఎలా గుర్తించగలిగారు? అందువలన గ్రీకు భాషలో పాండిత్యం కలిగిన తనను ఎన్నుకొని అంతియొకయ పంపిస్తున్నారు.

నిన్న ఉదయాన యెరూషలేము నుండి బయలుదేరిన బండి సాయంకాలం వరకు ప్రయాణం సాగించింది. మధ్యాహ్నం హోజోరు పట్టణంలో ఒక గంట భోజన విరామం. చాలా సంవత్సరాలుగా ఎటు వైపునకు ప్రయాణాలు చేయని తను ఈ రోజు ఇంత దూరం ఇన్ని బాధ్యతలతో మొట్ట మొదటిసారిగా సిరియా దేశంలో ఈ సువార్త సేవకు ప్రత్యేకించబడటం ఇది దేవుని ఏర్పాటే. తనవలె గొప్ప ఆస్తిని అమ్మి ప్రభువునకు సమర్పించుకున్నవారు వేరే లేకపోలేదు. తన జీవితంలో మొట్టమొదటిసారిగా యెరికో పట్టణంలో ప్రభువును కలసికొనినప్పుడు, 'నిత్య జీవమునకు వారసుడగుటకు నేనేమి చేయవలెన'ని మోకరించి అడిగినప్పుడు, ఆయన జవాబు తనకు నిరాశ, వ్యసనం కలిగించినది. ఆయన నీకు కలిగినవన్నీ అమ్మి బీదలకిమ్ము నీవు వచ్చి నన్ను వెంబడింపుము అన్నాడు. తనకు కలిగినవన్నీ బీదలకిచ్చి తను కూడా వారిలో ఒక బీదవాడైన తర్వాత తను ఆ యేసునకు ఏ విధంగా తోడ్పడగలడు?

ఈనాడు తన ఆస్తి తను కలిగియుంటే ఆ ఆస్తి కాపాడుకొనే యత్నంలో తను ఏమి నెమ్మది కలిగి యుండేవాడు కాడు. ఈ రోజున ఉన్నఫళంగా అంతియొకయకు ప్రయాణం జరిగేది కాదు. ఈ విశ్వసయాత్రలో యెరూషలేములోని శిష్యులందరు కలసి నేటి ప్రపంచంలో మూడు నాగరిక నగరాలైన వాటిలో ఒకటైన అంతియొకయలో సేవ చేయుటకు అర్హత కలిగిన వానిగా భావించి పంపిస్తున్నారు.

ఓడలోని మంచాలు ఓడకి అతికించి ఉంటాయి. అయినప్పటికి బర్నబా భారి దేహం అటు ఇటు కదిలినప్పుడు ఇనుప మంచం శబ్దం చేస్తుంది. తన ఆరడుగుల శరీరానికి ఈ మంచం సరిపోలేదు కాబోలు అనుకున్నాడు. ఇంకా వారం రోజులు ప్రయాణం, సెలూకయలో ఓడ దిగి ఎనిమిది మైళ్ళ ప్రయాణం.

సిరియా దేశానికి పశ్చిమాన చివరిలో మధ్యధరా సముద్రపు రేవు పట్టణం సెలూకయ ఓరెంటస్ నది ముఖద్వారం దగ్గరలో ఉంది. ఉదయాన్నే సూర్యుని కెదురుగా ఓడ నుండి రేవుకు వస్తుంటే ఎదురుగా ఉన్న పర్వతాలు కాంతి విహీనంగాను, పగిలిన పెద్దరాళ్ళు గుట్టలలాగను కనిపించాయి. కాని లోయలు అన్ని ఆప్రికాట్ పండ్ల తోటలతోను, మల్బరి చెట్లతోను, పచ్చగా కళకళలాడుతూ కనిపించాయి. సముద్రంలోకి చొచ్చుకొని వచ్చిన కాస్సకమస్ పర్వతమునకు ఉత్తరంగా ఉన్న ఓడరేవు నిశ్శబ్దంగా నిద్రపోతున్నట్లు అనిపించింది.

పట్టణమంతా ఈ పర్వతం మీదనే కట్టబడింది. ఈ కొండ క్రింద నుండి చూస్తుంటే పెద్ద పెద్ద గదులంత సమాధులు కనిపించాయి. ఈ ఓడ రేవు అంత ప్రయోజనకరం కాకపోయినను ఇక్కడికి ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న అంతియొకయ పట్టణానికి వేరే గత్యంతరం లేదు. అందువలన రోమా చక్రవర్తులు ఒకరి తర్వాత ఒకరు ఎంత డబ్బు ఖర్చు చేసినా ఓడరేవు సరిగా బాగుపడలేదు. ఓడరేవు చివరిలో కాషియన్ కొండముందు వేలకొలది రోమా సైనికులు, పనివారు మంచినీటి కొరకు సొరంగం త్రవ్వుచున్నారు. అంతియొకయ పట్టణానికి సరిపోయే మంచినీరు ఇక్కడ నుండి వస్తుంది. ఈ సొరంగం

ఆరుమైళ్ళు పొడవు ఇరవై అడుగుల వెడల్పు ఇరవై అడుగుల ఎత్తు.

కేషియన్ కొండ చుట్టూ తిరిగి తూర్పుగా వచ్చినప్పుడు అంతియొకయ పట్టణానికి పోయే రాజమార్గం కనిపిస్తుంది. ఈ దారి అంతా నాపరాళ్లతో కప్పబడి ఉంది. ఈ పట్టణం రోమా గవర్నరుకు నివాసమైనందున రాచబాట చాలా విశాలంగాను, అందంగాను, బాటకిరువైపులా పూలచెట్లు పెంచబడి యున్నవి. గుర్రపుబగ్గీ సెలూకయ నుండి పరుగెడుతుంటే అక్కడి సముద్రపు దీప స్థంభము క్రమంగా చిన్నదైపోతూ ఉంది. ఓడరేవు నిర్మించబడిన కొండలు ఒకమైలు ప్రయాణం తర్వాత దాటి విశాలమైన మైదాన మార్గముగుండా బగ్గీ వేగంగా పయనించసాగింది. కొంత దూరంలో రోమా సైన్యంలో కొంత భాగం, గుఱ్ఱపు రౌతులు, మధ్యలో అందమైన బగ్గీ, అందులో ఎవరో రోమా అధిపతి ఉండి ఉండవచ్చు అనుకుంటూ బగ్గీని మార్గం ప్రక్కగా ఆపి యుంచాడు చోదకుడు.

కొంచెందూరం వెళ్ళిన తరువాత బాట ఉత్తరం వైపు తిరిగింది. వెంటనే అంతికయొకయ నగరంలోని ఎత్తైన కట్టడాలు దక్షిణ ముఖంలో సూర్యరశ్మిలో సింధూర కాంతిలో దర్శనమిచ్చాయి. "ఇంకా నాలుగు మైళ్ళు వెళ్తేగాని పట్టణపు గవినిలో ప్రవేశించం"అన్నాడు మనయేసు. ఇంతకు నుందు రెండుసార్లు ఇక్కడ జరిగే ఆటల పోటీలలో పాల్గొనటానికి వచ్చాము అన్నాడు. దారిలో రంగస్థల సనుదాయం వారికి ఎదురయ్యింది. పట్టణం సమీపించే కొలది అందలి పూలవనాలు, స్నానఘట్టనులు, గురుకు లాలు కనిపినిచాయి. ఎత్తైన మిద్దెలకు వేసిన రంగులు మెరుస్తూ నిన్న మొన్న వేసినంత కాంతివంతంగా ఉన్నాయి.

సుమెయోను, మనయేసు గుఱ్ఱపు బగ్గీ కిటికీలో నుండి బండి ప్రయాణం చేస్తున్నబాట కిరువైపులా పెంచబడుచున్న పూలచెట్లను గమనిస్తున్నారు. ఎంత ధనం వ్యయపరిస్తే ఈ రహదారి ప్రక్కన ఇంత చక్కని చెట్లను పెంచగలరు. రోమా సామ్రాజ్యం ప్రపంచమంతా రహదారులను రాజ బాటలుగా చేస్తుంటే సిరియనులు ఆ రహదారుల వెంబడి చెట్లను పెంచే ప్రతిభ.

గవినిలో ప్రవేశించినపుడు అక్కడ ప్రభుత్వాధికారులు ప్రయాణికుల వివరాలు వ్రాసుకుంటున్నారు. గవిని ఎంతో అందంగా అలంకరింపబడి యున్నది. పట్టణం మధ్యలోని రాజబాట విశాలంగా దాదాపు నాలుగు మైళ్ళ పొడవులో తిన్ననిదై యున్నది. బాట మధ్య భాగం రథాలకు ఇరు వైపులా పాదచారులకు ఇరివైపులా ఎత్తైన భవనాలు, దేవాలయాలు, వ్యాపార కేంద్రాలు బండిలో నుండి చూస్తున్న బర్నబా "యెరికో పట్టణం కంటే ఎంతో సుందర మైంది" అన్నాడు. అంతియొకయ రాత్రి నెరుగదు అన్న నానుడి. బాటకిరువైపులా అమర్చిన దీప స్థంభనులు చూస్తే తెలుస్తుంది.

ఎక్కువ కష్టపడకుండానే సమాజమందిరం కను క్కొన్నారు. ప్రపంచంలో ఏ ప్రాంతంలో నివసించినప్పటికి యూదులు ప్రత్యేక జనాంగమే. వారి ఆచారాలు, ఆహారపు అలవాట్లు, వారి దేవుడు కూడా ప్రత్యేకమే. అందువలన వారు నివసించే ప్రాంతం ఒక సమాజ మందిరంతో ముడిపడి ఉంటుంది. ఇక్కడ శిష్యులలో యూదులు సంఖ్యాపరంగా చాలా తక్కువ. అందరూ గ్రీకు వారివలె కనిపించినా అన్ని జాతుల సంస్కృతులు గలవారున్నారు. విదేశీయులందరిని యూదులు గ్రీకులు అని పిలుస్తారు.


**గమనిక**

**GNM మరియు B.Sc. Nursingలలో ఖాళీలు కలవు. మీ పిల్లలను చేర్చాలనుకొనే వారు వెంటనే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేసి మీ సీటు రిజర్వ్ చేసుకోండి**

**9676340371, 9704255416**

# ఎక్కడ ప్రేమ ఉంటే అక్కడ దేవుడున్నాడు 

## (లియో టాల్‌స్టాయ్)

రష్యాలోని ఓ చిన్నపట్టణంలో మార్టిన్ అనే ఓ వృద్ధుడు నివశిస్తున్నాడు. బజారు ప్రక్కన ఉన్న ఓ ఇంటి వరండాలో ఉన్న ఓ చిన్న గదిలో నివశిస్తున్నాడు. బజారువైపుగా ఆ గదికి ఒక కిటికి ఉన్నది. తన గదిలో కూర్చుని చెప్పులు కుడుతూ కిటికీలో నుండి చూస్తే బజారులో నుండి నడిచే మనుష్యుల కాళ్ళు, ఆ కాళ్ళకు వేసుకున్న చెప్పులు మాత్రం తనకు కనిపిస్తాయి. చాలాకాలంగా అతను చెప్పులు కుడుతున్నందున నడిచేవారి పాదాలకు వేసుకున్న చెప్పులను బట్టి ఆ చెప్పులు వేసుకున్న మనుష్యుల వివరములు చెప్పగలడు.

అటువంటి చెప్పులు నాలుగయిదు సార్లు రిపేరుకు తన దగ్గరకు వచ్చినవే! మంచి దారమును, తోలును ఉపయోగించి నందువలన ప్రజలు ఎక్కువగా అతని దగ్గరకు వచ్చినందువలన అతనికి తీరుబడిలేనంత పని. అదీ కాక అతను రిపేరుకు ఎక్కువ డబ్బులు అడుగడు. ఎవరైనా పని ఇస్తే రేపురా, మాపురా అని వారిని తిప్పడు. యధార్థముగా ప్రవర్తించేవాడు.

మార్టిన్ చాలామంచివాడు. వృద్ధాప్యమున తన ఆత్మను గురించి ఎక్కువగా దేవుని గురించి ఆలోచించేవాడు. యవ్వనములో ఒక యజమాని దగ్గర పనిచేసాడు. అప్పుడు అతని భార్య మూడు సంవత్సరాల మగపిల్లవానిని తనకు వదిలి చనిపోయింది. అంతకుముందు పుట్టిన పిల్లలందరు చిన్నప్పుడే చనిపోయారు. మొదట్లో ఈ పిల్లవానిని తన అక్కగారి ఇంట్లో వదలి పెడదామనుకున్నాడు. కాని క్రొత్త మనుష్యులతో అతను ఇక్కడ ఉండగలడో లేడో అని తన దగ్గరే ఉంచుకున్నాడు. అప్పుడు తను పనిచేస్తున్న యజమానిని విడచి, చిన్నగదిని బజారు ప్రక్కన సంపాదించుకొని, చెప్పులు కుడుతూ తన కుమారునితో అక్కడే నివశించాడు. పిల్లవాడు పెద్దవాడై తనకు కొంత సహకారిగా ఉండేవాడు. అలా పది సంవత్సరాల వయస్సులో ఒక రోజు కాలిపోయేంత జ్వరము వచ్చి వారం రోజులు ఎన్నో మందులు వాడినా బ్రతుకలేదు.

మార్టిన్ ఎంతో కృంగిపోయాడు. హృదయంలో దేవునికి వ్యతిరేకముగా ఎంతో సణుగుకున్నాడు. తనే చనిపోవాలనుకున్నాడు. "నా ఒక్కగానొక్క కుమారుని తీసుకెళ్ళావు కనుక నన్ను కూడా చంపెయ్యి" అని దేవుని ప్రార్థించేవాడు. చివరికి చర్చికి వెళ్ళడం మానివేశాడు.

ఒకరోజు తన స్వంత గ్రామము నుండి ఒక యోగి వచ్చాడు. ఆయన గత ఎనిమిది సంవత్సరాలుగా "ట్రెయిటా ఆశ్రమము"లో జీవిస్తూ దేశదేశాలు తిరుగుతూ మార్టిన్ వద్దకు వచ్చాడు. మార్టిన్ తన హృదయములోని దుఃఖమంతా అతనికి చెప్పాడు.

"నాకు బ్రతకాలని లేదు. కనుక నన్ను చంపివెయ్యమని ఆ దేవుని అడుగుతున్నాను" అన్నాడు.

"ఆ విధంగా అడగడానికి నీకేమాత్రం హక్కులేదు మార్టిన్! దేవుని కార్యాలు మానవునికి అర్థం కావు. మానవులను ప్రేమించి వారికి ఏదిమంచిదో అదే ఆయన జరిగిస్తాడు. నీవు జీవించి ఉండాలని దేవుని నిర్ణయము. అయితే నీవు నీకొరకు మాత్రమే జీవిస్తున్నందున దేవుని చిత్తము నీలో నెరవేర్చబడలేదు" అన్నాడు.

"నేను నాకోసం కాక మరి ఎవరికోసం జీవించాలి?" అన్నాడు మార్టిన్.

"దేవుని కొరకు నీవు జీవించడం మొదలుపెట్టినపుడు నీలో సంతోషం పెల్లుబుకుతుంది. ఇక నీవెన్నడు దేవునిపై సణుగవు" అన్నాడు ఆ యోగి.

మార్టిన్ కొంచెం ఆలోచించి – "మన దేవుని చిత్తం

ఎలా కనుగొనగలము? దేవుని కొరకు ఎలా జీవించ గలము?" అని అడిగాడు.

"మానవుడు దేవుని కొరకు ఎలా జీవించాలో – యేసుక్రీస్తు మనకు చూపించాడు. నీవు ఒక బైబిలు కొను క్కొని చదువు. సువార్తలలో అప్పుడు దేవుడు మనల్ని ఎలా జీవించమన్నాడో నీకు అర్థమవుతుంది" అన్నాడు.

ఈ మాటలు మార్టిన్ హృదయములో లోతుగా నాటుకొని పోయాయి. ఆ సాయంకాలమే బజారు వెళ్ళి పెద్ద అక్షరాలు కలిగిన క్రొత్త నిబంధన గ్రంథము కొని తెచ్చాడు. ఒక్కోసారి అలా బైబిలును మైమరిచి పోయి చదువుతూ ఉంటే దీపపుబుడ్డిలోని కిరసనాయిలు పూర్తిగా అయిపోయేది. అలా చదివేకొలది అతని హృదయభార మంతా పోయి రాత్రిపూట పండుకొనినపుడు హృదయము తేలికగా అనిపించేది. దేవునికి స్తోత్రము! దేవుని నామము నకు మహిమ కలుగును గాక అనే మాట – ప్రభువా! నీ చిత్తం సిద్ధించుగాక అని పెద్దగానే పలుకుతుండేవాడు.

సెలవు దినాలలో బయటకు వెళ్ళి కొంచెం టీ త్రాగి వచ్చేవాడు. ఎవరైనా పిలిస్తే కొంచెం ఓడ్కా కూడా త్రాగే వాడు. పూర్వం ఎప్పుడైనా ఓడ్కా తీసుకుంటే అతివాగుడు వలన చిన్న చిన్న తగాదాలు చేస్తుండేవాడు. కాని ఇప్పుడు బయటివాళ్ళతో జీవితం తేలికగా ఉన్నది. ఉదయం నిద్రలేచి కాలకృత్యాలు ముగించి, భోజనం చేసి, పెట్టెలో బైబిలు తీసి బల్లమీద పెట్టి కొంచెం చదివి, తర్వాత తన పని వస్తువులు అన్ని బల్లమీదకు చేర్చి పనిచేస్తూ వాక్యాన్ని ధ్యానము చేసేవాడు. సాయంకాలం దీపపు బుడ్డి పెట్టుకొని నిద్ర వచ్చేదాక చదివేవాడు. చదివే కొలది బైబిలు బాగా అర్థమవుతూ ఉండేది.

ఒకరోజు లూకాసువార్త చదువుతువున్నాడు. 'ఒక చెంపమీద కొట్టినవానికి రెండవ చెంపను కూడా చూపండి. నీ పై కండువా తీసుకొనేవానికి నీ చొక్కాని కూడా తీసు కోనివ్వు. అడిగినవాళ్ళకు ఇవ్వండి. ఇతరులు మీ పట్ల ఎలా ప్రవర్తించాలని మీరు ఆశిస్తారో అదేవిధంగా మీరు ఇతరుల పట్ల ప్రవర్తించండి'. ఇంకా ప్రభువు చెప్పిన ఈమాటలు కూడా చదివాడు. 'నేను చెప్పింది చెయ్యకుండా నన్ను ప్రభువా, ప్రభువా అని పిలవడం ఎందుకు? నా దగ్గరకు వచ్చి నా మాటలు విని వాటిని అనుసరించేవాడు ఎలాంటివాడో చెపుతాను. అలాంటివాడు భూమి లోతుగా త్రవ్వి రాతిమీద పునాదివేసిన ఇల్లు కట్టుకున్నవానితో సమానము. అతడు తన ఇంటిని సక్రమమైన పద్ధతిలో కట్టాడు కనుక వరదలు వచ్చి నది ప్రవాహం ఆ ఇంటిని కొట్టినా ఆ ఇల్లు కూలిపోలేదు'.

ఇది చదివి మార్టిన్ కంటి అద్దాలు తీసి బల్లమీద పెట్టి మోచేతుల బల్లమీద ఆన్చి – తన జీవితం బండమీద పునాదివేసిన వానివలె ఉన్నదా? అని ఆలోచించాడు. దేవుని వాక్యాన్ని ధ్యానిస్తూ – 'దేవా! నన్ను సరైన దారిలో నడిపించు' అని మనసులో ప్రార్థించుకొని రాత్రి భోజనము చేసి మంచము మీద పండుకున్నాడు. మళ్ళీ లేచి లూకా ఏడవ అధ్యాయము చదువసాగాడు. శతాధిపతిని గురించి, విధవరాలి కుమారుని గురించి, యోహాను శిష్యుల ప్రశ్నల గురించి, తర్వాత ధనవంతుడైన పరిసయ్యుడు ప్రభువును ఇంటికి ఆహ్వానించిన సంఘటన చదివాడు. ఆ ధనవంతు డైన పరిసయ్యుడు ప్రభువును తన ఇంటికి ఆహ్వానించాడు కాని గౌరవించలేదు. పరిసయ్యుడు ఆయన పాదములకు నీళ్ళియ్యలేదు. ఆయనను ముద్దు పెట్టుకోలేదు. నేను కూడా పరిసయ్యుని వలె ఉన్నాననుకున్నాడు మార్టిన్.

'నేను కూడా ఎప్పుడు నా టీ విషయం, నా గది వేడి చేసుకొనే విషయం ఆలోచిస్తుంటాను. ప్రభువు నా దగ్గరకు వస్తే నేను గౌరవంగా చూడాలి' అనుకున్నాడు మార్టిన్. అలా ఆలోచిస్తూ నిద్రలోకి జారిపోయాడు.

మార్టిన్‌కు ఎవరో తన చెవి మీద ఊదినట్లు అనిపించింది.

తలపైకెత్తి – "ఎవరక్కడ?" అన్నాడు కొంచెం ఆగి తలుపువైపు చూచాడు. ఎవరూ కనిపించలేదు.

"మార్టిన్! రేపు ఉదయం నేను వస్తాను. వీధివైపు కనిపెట్టి ఉండు" అనిన స్వరము వినిపించింది. మార్టిన్ లేచి నిలుచున్నాడు. ఈ స్వరము తను కలలో విన్నాడా?

లేక వాస్తవమా? అని ఆలోచించాడు. చాలాసేపు ఆలోచించి పండుకొని నిద్రపోయాడు.

మరునాడు పెందలకడలేచి, ప్రార్ధన చేసుకొని, గది మూలలో మంట పుట్టించి, స్టౌ ముట్టించి పొయ్యిమీద కేబేజి సూపు కాయడం మొదలు పెట్టాడు. కిటికి ప్రక్కన కుర్చీలో కూర్చుని బయటకు చూస్తూ రాత్రి జరిగినది నిజమా? కలా? అని ఆలోచిస్తూ ప్రారంభించాడు. అయితే పనికంటే ఎక్కువగా కిటికీల గుండా బయటకు చూస్తు న్నాడు. కుంపటిమీద సూపు ఉన్నది. ఎప్పుడైనా తనకు అలవాటు లేని చెప్పులు కాని, బూట్లు కాని వేసుకున్నవారు కిటికీలో నుండి కనబడితే అతని ముఖము కొరకు చూసే వాడు.

కొంచెంసేపటికి తనకు తెలిసిన బూట్లు కలిగిన వ్యక్తి కనిపించాడు. అతను స్టెపెంటా. చాలా వృద్ధుడు. తన వీధిలో ఓ వ్యాపారి అతని ఆదరించి తన ఇంటిలో ఉంచు కున్నాడు. ఏవైనా చిన్నపనులు ఉంటే అతనికి చెబుతారు. అతని చూసి మరలా తన పనిలో మునిగాడు మార్టిన్. కొంచెంసేపు పనిచేసి మరలా కిటికీలో గుండా చూశాడు. స్టెపెంటా తన చేతిలోని కర్రను గోడకు ఆనించి నిలుచు న్నాడు. అతను పడిపోకుండా కర్రమీద ఆధారపడ్డాడా? లేక బయట కురుస్తున్న మంచు వలన శరీరం అతనితో సహకరించలేదా? అనుకుంటూ మరలా – 'నాకు వయస్సు పెరిగే కొలది బుద్ధిమాన్యం వస్తుంది. లేకుంటే యేసు ప్రభువు నా ఇంటికి వస్తాడని నేను ఎలా అనుకున్నాను?' అనుకొని ఇలా అనుకొంటూ కిటికీ వద్ద నిలుచున్న స్టెపెంటా వైపు చూచి – 'పాపం చాలా వృద్ధుడు. చలికి వణుకుతున్నాడు. లోనికి పిలిచి కొంచెం టీ ఇస్తాను' అను కొని కిటికి మీద వ్రేలితో కొట్టాడు. స్టెపెంటా తన కోటు మీద, టోపీ మీద పడిన మంచును తుడుస్తూ మార్టిన్ వైపు చూచాడు. మార్టిన్ అతనిని లోనికి పిలిచి కొంచెం టీ పోసి అతనికిచ్చి, తనుకూడా కొంచెం టీ పోసుకొని కూర్చున్నాడు.

టీ త్రాగుతూ – "నా ఎముకలు ఈ చలికి కొంగర్లు పోయాయి" అని "దేవుడు నిన్ను దీవించునుగాక" అన్నాడు. స్టెపెంటా టీ త్రాగి గ్లాసువైపు చూస్తున్నాడు. మార్టిన్ మరియొక్క కప్పు టీ అతనికి పోశాడు. అదీ త్రాగాడు. మార్టిన్ లేచి ఇంకొక కప్పు టీ పోశాడు. ఇప్పటికి స్టెపెంటా చలి తగ్గింది. వణుకు ఆగింది. "నీవు ఎవరైనా వస్తారని ఎదురుచూస్తున్నావా?" అని మార్టిన్‌ని అడిగాడు.

**(సశేషం)**




**స్వదేశాగమన శుభాకాంక్షలు**



**మా సంఘకాపరి రెవ.డా॥ కొడవటికంటి జోసఫ్‌గారు**
**మరియు వారి సతీమణి శ్రీమతి రేచల్ జోసఫ్‌గారు**
**అమెరికా దేశములో సువార్త పరిచర్య ముగించుకొని**
**తిరిగి స్వదేశమునకు వస్తున్న సందర్భముగా**
**వారికి మా హృదయపూర్వక ఆహ్వానము**

**ఇట్లు, సంఘస్తులు**
**ప్రభువు సంఘము, క్లౌపేట, ఒంగోలు**

# బైబిలు కథలు - ఏదెను తోట

పిల్లలూ బాగున్నారా? వేసవి సెలవులు ముగుస్తున్నాయి కదా! మరి ఈ వేసవి సెలవులలో ఏం చేశారు. చాలామంది వేరే ఊర్లలో ఉన్న బంధువుల ఇళ్ళకు వెళ్ళివుంటారు కదా! మరి ఈ సెలవులను మనం దేవునికి ఇష్టంగా గడిపారా ఎవరైనా! మీరు ఈ సెలవులలో బైబిల్‌ను ఒకసారి పూర్తిగా చదవండి అని గత సంచికలో చెప్పినట్లు ఎవరైనా పూర్తిగా చదివారా? గతనెలలో మనం సృష్టిక్రమము గురించి తెలుసుకున్నాం కదా! మరి మీకు గుర్తు వుందా దేవుడు ఏ రోజున ఏం చేశాడో. మనం బైబిలు జ్ఞానము సంపాదించటం వలన దేవుడు చాలా సంతోషిస్తాడు. మరి ఈ నెలలో మనం ఏదేను తోట గురించి తెలుసుకుందామా? మీరు రెడియేనా.




## ఏదెను తోట

దేవుడు సృష్టి మొత్తాన్ని ఆరు రోజుల్లో పూర్తి చేశాడని తెలుసుకున్నాం కదా! ఆరో రోజున మనుష్యులను చేశాడు. ఏడో రోజున విశ్రాంతి తీసుకున్నాడు. మనుష్యులను చేసిన తర్వాత వారిని ఆశీర్వదించాడు. ఎట్లనగా "మీరు ఫలించి అభివృద్ధి చెంది భూమిని నింపండి" అని. అంటే మీరు పిల్లలని కని ఈ భూమి అంతా విస్తరించమని ఆశీర్వదించాడు.

తర్వాత దేవుడు తూర్పుదిక్కున ఏదెను అనే ప్రదేశంలో ఒక పెద్ద తోట వేశాడు. ఎంత పెద్ద తోట అంటే, ఆ తోటని తడపటానికి ఒక పెద్ద నది బయలుదేరి నాలుగు శాఖలుగా చీలి నాలుగు దిక్కుల ప్రవహిస్తున్నాయి. ఆ నాలుగు నదుల పేర్లు ఏంటంటే, మొదటి దాని పేరు పీషోను, రెండవ దాని పేరు గీహోను, మూడవ దాని పేరు హిద్దెకెలు, నాల్గవ దాని పేరు యూఫ్రటీసు. ఈ నది పేరు మీరు వినే వుంటారు కదా! ఇప్పటికీ ప్రపంచ పటంలో మనకు యూఫ్రటీసు నది కనిపిస్తుంది. మరి నాలుగు నదులు ఏదెను తోటను తడుపుతున్నాయంటే అది చాలా పెద్ద తోట కదా! అంత పెద్ద తోటని సేద్యం చేయాలంటే చాలామంది కావాలి కదా! ఆదాము, హవ్వలతో పాటు వారికి పుట్టే పిల్లలు కూడా సేద్యం చేయటానికే దేవుడు అంత పెద్ద తోట వేశాడు.

ఆదాము, హవ్వలు, వారి పిల్లలు తినడానికి ఆ తోటలో అన్ని రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు వేశాడు దేవుడు. మీకు తెలుసు కదా పండ్లు మనుష్యులకి ఆరోగ్యాన్ని, బలాన్ని ఇస్తాయి. డాక్టర్లు కూడా ఏం చెప్తారు, మనకి అనారోగ్యంగా ఉంటే పండ్లు తినమని చెప్తారు కదా! దేవుడు మనకి మేలైనది, మనకి ఆరోగ్యాన్ని ఇచ్చేవే చేశాడు.

అంతేకాక దేవుడు ఆ తోటలో రెండు ప్రత్యేకమైన చెట్లు వేశాడు. ఒకటి మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు, రెండవది జీవవృక్షఫలమునిచ్చే చెట్టు. జీవవృక్షఫలము తింటే మనిషి నిరంతరం జీవిస్తాడు. అయితే మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము తింటే చచ్చిపోతాడు. అందుకే దేవుడు ఆదాముతో మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టు ఫలము తినవద్దని చెప్తాడు. ఆ కథ ఏంటో వచ్చే నెలలో 'ఆదాము-హవ్వ' కథలో తెలుసుకుందాము. ఈ నెల నుండి మీరు స్కూలుకి వెళ్ళడానికి రెడి అవుతున్నారు కదా! ప్రతిరోజూ బైబిలు చదివి, ప్రార్థన చేసుకోండి. దేవుడు మిమ్మును గొప్పగా ఆశీర్వదిస్తాడు.

కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. మత్తయి 28:19

# HOLY BIBLE SCHOOL

6th Lane, Cloughpet, ONGOLE

# హోలి బైబిల్ స్కూల్

**ఆగష్టు 1వ తేది నుండి బైబిలు పాఠశాల ప్రారంభం**

అర్హత : 10వ తరగతి పాస్/ఫెయిల్

కాలపరిమితి : 6 నెలలు (3 నెలలు క్లాసులు, 3 నెలలు అవుట్‌రీచ్)

మొత్తము 15 మంది విద్యార్థులకు (స్త్రీ/పు) మాత్రమే

**ఉచిత శిక్షణ. మా దగ్గరే ఉండుటకు అవకాశము కలదు.**
**బయట నుండి కూడా రావచ్చును. వసతి మరియు భోజనము ఉచితము**

ఉత్తమమైన బైబిల్ శిక్షణ మరియు అనుభవజ్ఞులైన బైబిల్ టీచర్స్‌తో క్లాసులు జరుపబడును. అమెరికా దేశము నుండి బైబిల్ టీచర్స్ మరియు స్వదేశీ బైబిల్ పండితులచే ప్రతిరోజూ పాఠములు బోధింపబడును గనుక ఆసక్తిగలవారు ఈ అవకాశమును వినియోగించుకొనవలెను.

మరిన్ని వివరములకు సంప్రదించండి :


**రెవ. కె. సామ్రాట్**
**ప్రిన్సిపాల్/సెక్రటరీ**
**హోలీ బైబిల్ స్కూల్**
**6వ లైను, క్లౌపేట**
**ఒంగోలు-523001**
**సెల్ : 9542417771**

**రెవ.డా॥ కె.జోసఫ్**
**ఫౌండర్/ప్రెసిడెంట్**
**ఐ.ఈ.ఆర్.ఎఫ్**
**6వ లైను, క్లౌపేట**
**ఒంగోలు-523001**
**సెల్ : 9704255416**

ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**



# బైబిలు చరిత్ర

**సేకరణ:** రెవ.డా॥ కె.జోసఫ్

**అపొస్తలుల కార్యములు గ్రంథంలోని సూచకక్రియలు :** శృంగార దేవాలయం వద్ద కుంటివానికి స్వస్థత (3:1-26) అననీయ సప్పీరాల మరణం (5:1-10) ప్రజల మధ్య అనేకులకు స్వస్థత (5:12-16) ఫిలిప్పు సూచకక్రియలు (8:6,7) పేతురు ఐనెయను స్వస్థపర్చడం (9:33,34) పౌలు ఎలుమను గ్రుడ్డివానిగా చేయడం (13:91-11) లుస్త్రలో బలహీనపాదాలున్న వ్యక్తికి స్వస్థత (14:7-10) పౌలు పుతోను దయ్యాన్ని తోలివేయడం (16:16-18) పౌలు ఎఫెసులో చేసిన సూచకక్రియలు (19:11,12) పౌలు ఐతుకును బ్రదికించడం (20:9-12) పౌలును సర్పం కరచినప్పటికీ ఏమీ కాకపోవడం (28:3-6) పౌలు పొప్లి తండ్రిని అనేకులను స్వస్థపర్చడం (28:8,9)

| **ఉపమానాల పట్టిక** | **మత్తయి** | **మార్కు** | **లూకా** | **యోహాను** |
|---|---|---|---|---|
| విత్తువాడు | 13:3-10 | 4:1-20 | 8:4-15 | - |
| గురుగులు | 13:24-30 | - | - | - |
| ఆవగింజ | 13:31,32 | - | 13:18,19 | - |
| పుల్లనిపిండి | 13:33 | - | 13:20,21 | - |
| పొలంలో దాచబడిన ధనం | 13:44 | - | - | - |
| అమూల్యమైన ముత్యం | 13:45,46 | - | - | - |
| చేపల వల | 13:47,48 | - | - | - |
| తప్పిపోయిన గొర్రె | 18:11-13 | - | 15:1-7 | - |
| ద్రాక్షతోటలోని పనివారు | 20:1-16 | - | - | - |
| ద్రాక్షతోట యజమాని | 21:33-41 | 12:1-9 | 20:9-16 | - |
| పెండ్లి విందు | 22:1-14 | - | 14:15-24 | - |
| పదిమంది కన్యకలు | 25:1-13 | - | - | - |
| తలాంతులు | 25:14-30 | - | 19:11-27 | - |
| స్త్రీ పోగొట్టుకొన్న నాణెం | - | - | 15:8-10 | - |
| తప్పిపోయిన కుమారుడు | - | - | 15:11-32 | - |

**బైబిల్లో కనిపించే ప్రార్థనలు**

కీర్తనలలో చాలా భాగం ప్రార్థనలే. క్రింద పేర్కొన్న కీర్తనలలో వ్యక్తిగత ప్రార్థనలు, ఇతరులు చేసినట్టు ప్రస్తావించబడిన ప్రార్థనలు కూడా వున్నాయి.


| **రెఫరెన్సు** | **ప్రార్థించినవ్యక్తి** | **వివరణ** |
|---|---|---|
| ఆది 4:13,14 | కయీను | కరుణ కొరకు |
| ఆది 15:2,3 | అబ్రాహాము | కుమారుని కొరకు |

| రెఫరెన్సు | ప్రార్థించినవ్యక్తి | వివరణ |
|---|---|---|
| ఆది 17:18 | అబ్రాహాము | ఇష్మాయేలు కొరకు |
| ఆది 18:23-32 | అబ్రాహాము | సొదొమ కొరకు |
| ఆది 20:17 | అబ్రాహాము | అబీమెలెకు కొరకు |
| ఆది 21:14-20 | హాగరు | ఓదార్పు కొరకు |
| ఆది 24:12-14 | అబ్రాహాము దాసుడు | నడిపింపు కొరకు |
| ఆది 25:21 | ఇస్సాకు | సంతానం కొరకు |
| ఆది 25:22 | రిబ్కా | జవాబు కొరకు |
| ఆది 32:9-12 | యాకోబు | ఏశావునుండి రక్షణ కొరకు |
| నిర్గమ 2:23 | ఇశ్రాయేలీయులు | విడుదల కొరకు |
| నిర్గమ 8:12 | మోషే | ఫరో కొరకు |
| నిర్గమ 15:25 | మోషే | నీటి కొరకు |
| నిర్గమ 32:31,32 | మోషే | ఇశ్రాయేలీయుల కొరకు |
| సంఖ్యా 12:13 | మోషే | మిర్యాము కొరకు |
| సంఖ్యా 27:15-17 | మోషే | తదుపరి నాయకుని కొరకు |
| ద్వితీ 3:23-25 | మోషే | వాగ్దానదేశ వీక్షణం కొరకు |
| యెహోషువ 7:7-9 | యెహోషువ | సహాయం కొరకు కృపకొరకు |
| న్యాయాధి 6:36,37 | గిద్యోను | రుజువు కొరకు |
| న్యాయాధి 15:18 | సమ్సోను | నీటి కొరకు |
| న్యాయాధి 16:18 | సమ్సోను | బలం కొరకు |
| 1 సమూ 1:10,11 | హన్నా | కుమారుని కొరకు |
| 1 సమూ 7:9 | సమూయేలు | ఇశ్రాయేలీయుల కొరకు |
| 1 సమూ 23:10-12 | దావీదు | సహాయం కొరకు |
| 2 సమూ 2:1 | దావీదు | నడిపింపు కొరకు |
| 2 సమూ 7:18-29 | దావీదు | ఆశీర్వాదం కొరకు |
| 1 రాజులు 3:6-9 | సొలొమోను | జ్ఞానం కొరకు |
| 1 రాజులు 17:20,21 | ఏలీయా | విధవరాలి కుమారుణ్ణి బ్రతికించడం కొరకు |
| 1 రాజులు 18:36,37 | ఏలీయా | బయలు ప్రవక్తలపై విజయం కొరకు |
| 2 రాజులు 19:4 | ఏలీయా | మరణం కొరకు |
| 2 రాజులు 6:17-20 | ఎలీషా | పనివాడి కొరకు |
| 2 రాజులు 13:4 | యెహోయాహాజు | విజయం కొరకు |
| 2 రాజులు 19:15-19 | హిజ్కియా | శత్రువులపై విజయం కొరకు |
| 2 రాజులు 20:2,3 | హిజ్కియా | స్వస్థత కొరకు |
| 1 దిన 4:10 | యబ్బేజు | ఆశీర్వాదం కొరకు |
| 1 దిన 5:20 | రూబేనీయులు | విజయం కొరకు |
| 2 దిన 13:14 | అబీయా సైన్యం | విజయం కొరకు |

| రెఫరెన్సు | ప్రార్థించినవ్యక్తి | వివరణ |
|---|---|---|
| 2 దిన 14:11 | ఆసా | విజయం కొరకు |
| 2 దిన 15:12-15 | యూదా ప్రజలు | ప్రమాణం కొరకు |
| 2 దిన 18:31 | యెహోషాపాతు | విజయం కొరకు |
| 2 దిన 20:5-12 | యోహోషాపాతు | సంరక్షణ కొరకు |
| 2 దిన 30:27 | యాజకులు | ఆశీర్వాదం కొరకు |
| 2 దిన 33:12,13 | మనష్షే | విడుదల కొరకు |
| ఎజ్రా 9:6-15 | ఎజ్రా | క్షమాపణ కొరకు |
| నెహెమ్యా 1:4-11 | నెహెమ్యా | యూదుల కొరకు |
| యిర్మీయా 14:7-9 | యిర్మీయా | కృప కొరకు |
| యెహెజ్కేలు 4:14 | యెహెజ్కేలు | పరిశుద్ధత కొరకు |
| దానియేలు 2:20-23 | దానియేలు | జ్ఞానం కొరకు |
| దానియేలు 9:4-19 | దానియేలు | యూదుల కొరకు |
| యోనా 2:1-9 | యోనా | రక్షణ కొరకు |
| హబక్కూకు 1:2-4 | హబక్కూకు | న్యాయం కొరకు |
| హబక్కూకు 3:2-19 | హబక్కూకు | విడుదల కొరకు |
| మత్తయి 6:9-13 | యేసు | పరలోక తండ్రికి ప్రార్థన |
| మత్తయి 8:2 | కుష్ఠరోగి | స్వస్థత కొరకు |
| మత్తయి 8:5-9 | శతాధిపతి | దాసుని స్వస్థత కొరకు |
| మత్తయి 9:27 | ఇద్దరు గ్రుడ్డివారు | దృష్టి కొరకు |
| మత్తయి 11:25,26 | యేసు | స్తుతి ప్రార్థన |
| మత్తయి 15:21-22 | కనాను స్త్రీ | కుమార్తె స్వస్థత కొరకు |
| మత్తయి 20:30,31 | ఇద్దరు గ్రుడ్డివారు | దృష్టి కొరకు |
| మత్తయి 26:39,42,44 | యేసు | నడిపింపు కొరకు |
| మార్కు 5:23 | యాయీరు | కుమార్తె స్వస్థత కొరకు |
| మార్కు 10:47 | బర్తిమయి | దృష్టి కొరకు |
| లూకా 17:13 | పదిమంది కుష్ఠరోగులు | స్వస్థత కొరకు |
| లూకా 18:13 | సుంకరి | క్షమాపణ కొరకు |
| లూకా 23:34 | యేసు | ఇతరులను క్షమించడం కొరకు |
| లూకా 23:42 | నేరస్థుడు | రక్షణ కొరకు |
| లూకా 23:46 | యేసు | ప్రాణాన్నర్పిస్తూ చేసిన ప్రార్థన |
| యోహాను 11:41,42 | యేసు | లాజరును బ్రతికిస్తూ చేసిన ప్రార్థన |
| యోహాను 12:28 | యేసు | తండ్రిని మహిమపరుస్తూ చేసిన ప్రార్థన |
| యోహాను 17:1-26 | యేసు | తనవారందరికొరకు చేసిన ప్రార్థన |
| అ.కా 9:40 | పేతురు | దొర్కాను బ్రతికించడం కొరకు |
| అ.కా 12:5,12 | సంఘం | పేతురు కొరకు |
| అ.కా 28:8 | పౌలు | పొప్లి తండ్రి కొరకు |

# స్ముర్న సంఘం

## (శ్రమ పొందుచున్న సంఘం)



బ్రదర్ కె.సామ్రాట్

స్ముర్న అంటే "బోళము" అని అర్థం. యాజకులు, ప్రధాన యాజకులు ప్రత్యక్షపు గుడార సేవకు వాడే ప్రతిష్ఠాభిషేక తైలమును (నిర్గమ. 2:11, మార్కు 15:23, యోహాను 19:39) వాడినట్లు చూడగలం. బోళం శ్రమను, విచారాన్ని సూచిస్తుంది. ఈ సంఘకాలము క్రీ.శ. 120– 132 వరకు. ఈ పట్టణం చిన్నాసియాకు పశ్చిమాన ఉంది. ఆసియాకు ఘనత తెచ్చిన సంఘం యిది. ఇది జలసంధి ప్రక్కన వుంది. వ్యాపారానికి అనుకూలమైనందువల్ల జన సమ్మర్థతగల పట్టణంగా ప్రఖ్యాతి చెందింది. క్రీ.పూ. 627లో లిడియా వారిచేత నాశనం చేయబడింది. యించుమించు 400 సం॥లు శిథిలావస్థలోనే ఉంది. గ్రీకు మహారాజు అలెగ్జాండరు ఈ పట్టణ నిర్మాణానికి పూను కున్నాడు గాని అతని మరణం తర్వాతనే పునర్నిర్మాణం గావించబడింది. సైన్సు, వైద్యకళా శాలలు ఇక్కడ ఉన్నాయి. ఇది కొంతకాలానికి రోమా ప్రభుత్వ ఏలుబడిలోకి వచ్చింది. అందువల్ల రోమా సార్వభౌమాధికార ఆరాధన మందిరము నొకదానిని నిర్మించారు. ఈ కాలము లోనే క్రైస్తవ సంఘం స్థాపించబడింది. ఈ పట్టణంలోని జనసంఖ్యలో 1/3 వంతు క్రైస్తవులేనని చరిత్రకారులు వివరిస్తున్నారు.

మొదటివాడును, కడపటివాడునై యుండి, మృతుడై మరలా బ్రతికినవాడు చెప్పు సంగతులేమనగా (3వ). ఇదే వచనం మొదటి అధ్యాయం 18వ వచనంలో కూడా ఉంది. ఇది వాస్తవంగా చెప్పుకోదగిన గొప్ప వివరణ. ఎందుకంటే విశ్వాసము నిమిత్తం శ్రమపడి ఖడ్గముతో చంపబడి, రాళ్ళతో కొట్టబడి, సింహములతో చీల్చబడిన వారందరికిని, అలాగే స్ముర్నలో శ్రమపడిన పరిశుద్ధులకు, మరణమును, శ్రమను ఎదుర్కొన్న వారికిని సకల కాలాలలోని వారిని అంటే అందరిని అన్నిటిని ఎరిగిన వాడను అని అర్థం. అంత మాత్రమే కాకుండా నేను కూడా శ్రమపడితిని (మృతుడనైతిని) గాని తిరిగి లేచితినని ప్రభువు చెబు తున్నాడు. "తాను శోధింపబడి శ్రమపొందెను గనుక శోధింపబడు వారికిని సహాయము చేయగలవాడై యున్నాడు" (హెబ్రీ. 2:18). మర ణాన్ని జయించిన నిత్య దేవుడు ఆయనే గనుక విశ్వసించిన వారు కూడా జయిస్తారని, బ్రతికిన నేను మిమ్మును బ్రదికిస్తాను అని దేవుని ప్రకటన. ఆయన కంటే ముందు ఏది లేదు. ఆయన తర్వాత ఏదీ ఉండబోదు.

<u>మంచి విషయాలు:</u> నీ శ్రమను, దరిద్రతను నేనెరుగుదును, అయినను నీవు ధనవంతుడవే (9వ). ఆ రోజుల్లో ఏభై లక్షల మంది క్రైస్తవ విశ్వాసులు మహాశ్రమల్లో హింసించ బడ్డారని లెక్కలు చెపుతున్నారు. నిజంగా స్ముర్న శ్రమ పొందుచున్న సంఘమే. గొప్ప శ్రమ, పేదరికం అనుభ వించారు. వాస్తవా నికి ఐశ్వర్యంగల సంఘమేగాని, కొంతకాలం శ్రమ అనుభవిం చింది. వారికున్న ఐశ్వర్యం అంతా దోచుకోబడింది. శ్రమల్లో కూడా స్థిరంగా నిలిచింది గనకనే శ్రమ సంఘమని పేరు కలిగింది. మరణము వరకు శ్రమలు పొందిన పరిశుద్ధులకు బలమైన ప్రోత్సాహముగా ప్రభువు తన్ను తాను బయలు పరుచుకున్నాడు. ఏమైనా వారు ధనవంతులే. ఎందుకంటే ప్రభువే మన కొరకు దరిద్రుడయ్యాడు (2కొరింథీ. 8:9). సమస్తాన్ని కోల్పోవ డానికి ఒప్పుకున్నాడు (హెబ్రీ. 10:34). పరలోకంలో ధనం కూర్చుకున్నవాడు (మత్తయి 6:20) ఓ రకంగా ఆలోచిస్తే అనేకుల్లో ఈలోక సంపద ఆత్మీయ దారిద్ర్యానికి దారితీసిన సంఘటనలున్నాయి. పశ్చిమ దేశాల్లోను,

తూర్పు దేశాల్లో కూడా ఈ లోక సిరిసంపదలే ఆత్మీయ జీవితానికి ఆటంకంగా వున్నాయని అనేక వేదాంతులు పేర్కొంటున్నారు. శ్రామానుభవములోనే స్థిరమైన సంఘం పుడుతుంది. విశ్వాసులు శ్రమల ద్వారా ఆత్మీయంగా ధనవంతులౌతారు. పౌలు 40 రకాలైన శ్రమలను అనుభవిస్తూ ఆనందించాడు. అతని నోట నుంచి ఒక్క ఆయాసకరమైన మాట కూడా రాలేదు. శ్రమయే ఒక ధన్యతగా, దీవెనగా భావించాడు. ఈ సంఘంలో ధనవంతులు ప్రభువును నమ్ముకున్నందుకు ప్రభుత్వం వారి ఆస్తిపాస్తులన్నీ లాక్కున్నారు. పేదవారు కూడా ఉన్నారు. విశ్వాసానికి ఉరిత్రాడులా శిక్ష శ్రమ అనుభవించాల్సి వచ్చింది. వీరి దరిద్రమే ధరణికి ఆశీర్వాదం. పేదరికంలోనే దేవుని పట్ల సువాసనగా ఉన్నారు. ప్రియ విశ్వాసీ! నీ శ్రమలో, దరిద్రతలో దేవుని కొరకు సాక్షిగా ఉన్నావా? లేక ఏమిటీ శ్రమలని విసుక్కుంటూ సణుగుకుంటు న్నావా? వాక్యపు వెలుగులో పరిశీలించుకొనండి.

ఈ సంఘంలో ప్రభువు చెప్పే మరోమాట ఏమిటంటే, నీవు పొందబోవు శ్రమలకు భయపడకుము అని (9వ). ప్రభువును నమ్ముకున్నాక కూడా శ్రమలొస్తాయని నిష్టూరా లాడకుండా శ్రమను సహించండి. భయపడవద్దు. శ్రమన్నది క్రైస్తవునికి గొప్ప దీవెనకు మూలం. మీకు సంభవించే అగ్నివంటి మహాశ్రమను మహానందముతో సంతోషించు నిమిత్తము, "క్రీస్తు మహిమ బయలుపరచబడు నప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి" (1పేతురు 4:13). ఎందుకని? "మహిమా స్వరూపియైన ఆత్మ, అనగా దేవుని ఆత్మ మీ మీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు (4:14). ప్రభువుని విశ్వసించినందుకు బాధలు పొందడం, తిరస్కారం పాలవడం, లేక న్యాయంగా తమకు చెందాల్సిన హక్కుల్ని పోగొట్టుకొని హింసలకు గురికావడం, ప్రభువు పొందిన హింసలో ఏదో కొంత భాగమైనా పాలుపుంచు కోవడమే గదా! అందుకే భయపడ కూడదు. మరో రహస్యం ఏమిటంటే, మనల్ని శ్రమపెట్టే వాళ్ళు భక్తిహీనులైన మనుష్యులే అయినా, వారి మూలంగా దేవుడు తన ప్రయోజనాలను నెరవేర్చుకుంటాడనే ధృఢ నమ్మకం మనకుంది. శ్రమల మూలంగా దేవుడు తన ప్రజలను పవిత్రపరచి, తన పరి శుద్ధతకు వారు సాక్షులుగా ఉండేందుకు మనల్ని నిలబెట్టు కుంటాడు. ఫలితంగా ఆ సాక్ష్యంవల్ల ఇతరుల జీవితాల్లో మార్పు తప్పక వస్తుంది. అంతేకాక "శ్రమలో అతనికి నేను తోడైయుందును" (కీర్తన 91:15). శ్రమల ద్వారా ఆత్మీయ ధనవంతులం కాగలం. పరిమళ వాసనగా ఉండుటకే మనం శ్రమపడుతున్నాం. శ్రమల ద్వారానే శాశ్వతమైన లాభం చేకూ రుతుంది. గాఢాంధకారపు లోయలో మనతో కూడా ఉంటాడు.

"తాము యూదులమని చెప్పుకొనుచు, యూదులు కాక సాతాను సమాజపు వారి వలన నీకు కలుగు దూషణ నేనెరుగుదును" (9వ). రెండవ వచనంలో అపొస్తులులు కాకయే అపొస్తులులమని చెప్పుకొనే వారని చూశాం. ఇక్కడేమో యూదులు కాకయే యూదులమని చెప్పుకునే వారు స్ముర్న సంఘంలో చొరబడ్డారు. స్ముర్న సంఘాన్ని చెరప టానికి సాతాను రెండు విధాల ప్రయత్నం చేశాడు.

1) యూదా మద క్రియలను క్రైస్తవ్యంతో కలిపి చెరసాలని, వారిలోనే కొంతమంది బయలుదేరారు. 2) వెలుపలి నుంచి అనగా అన్యుల వలన ఎదిరింపులు (శ్రమలు) క్రైస్తవులకు సంభవించాయి.

అపొస్తలుల తర్వాత యూదా మతానికి చెందిన ఒక గుంపు లేచింది. వారే సాతాను సమాజం వారు. యూదా మతానికి చెందిన ఆచారాలు క్రైస్తవ్యానికి జోడించాలని కోరారు. వాళ్ళు గొప్ప వాళ్ళమని చెప్పుకొని విశ్వాసుల్ని హింసించారు. అలనాడు క్రీస్తును హింసించినట్టుగానే, క్రైస్తవుల్ని కూడా యూదులు హింసించారు. అన్యుల్ని రేకెత్తించి వారికి హింస కలిగించారు.

యూదుల్లా నటిస్తున్న వారిని చూస్తున్నాం. సాతాను సమాజంలో అబద్ధపు యూదులు వారిలో కొందర్ని చెరలో వేయించారు. ఆ అబద్ధపు యూదుల్లాగే ఈ దినాల్లో క్రైస్తవులు తమ నిజమైన పరలోక దర్శనమును పోగొట్టుకొని ఇహ సంబంధమైన గొప్పగొప్ప కట్టడములతోను, వ్యాపార సంస్థల తోను ఆచార వ్యవహారములతోను సంబంధం పెట్టుకొని

క్రైస్తవుల్లా నటిస్తున్నారు. నమ్మకస్తులను వెలుగులోనికి తేవటానికి స్ముర్న సంఘమును శ్రమల ద్వారా వడపోశాడు. ఇది ప్రభువు అనుమతించాడు. వారి శ్రమలకు కూడా హద్దులున్నాయి. మరణము చివరి హద్దు. మరణము గుండా వారు వెళ్ళినను రెండవ మరణం వలన ఏ హానియు చెందరని ప్రభువు చెప్పాడు.

నేడు ఈ సాతాను సమాజం వారిని గురించి సంఘాలు ఎంతైనా జాగ్రత్త వహించాలి సుమా. "ఏలయనగా అట్టివారు క్రీస్తు యొక్క అపొస్తలుల వేషము ధరించుకొను వారైయుండి, దొంగ అపొస్తలులును, మోసగాండ్రగు పనివారునైయున్నారు" (2కొరింథీ. 11:13). వీరు చూడ్డానికి చాలా చక్కగా కనిపిస్తారు. చమత్కారంగా మాట్లాడతారు. గాని వాక్యాన్ని గైకొననే గైకొనరు. బాహ్యానికి ఒక సమాజంలా కన్పిస్తారు గాని వారి అంతరంగ పీఠాధిపతి సాతానే. వారు గొఱ్ఱె చర్మాన్ని ధరించు కొన్న తోడేళ్ళు. నీతి పరిచారకుల వేషము ధరించుకొన్న దొంగ గుంపు. వారి ఎగ్జిక్యూటీవ్ సెక్రటరీ సాతాను. అతని అనుచరులు నామకార్థ క్రైస్తవులు. ఆత్మార్పణ లేని అయోగ్యులు. ఈ గుంపు ముఖ్యలక్షణం-పరిశుద్ధుల్ని పవిత్ర సంఘాల్ని దూషించటం. అందుకే వీరి వలన కలిగిన దూషణ నేనెరుగుదును అంటున్నాడు. మానవ పతనంలోని విపత్తుకు కారణం నేనెరుగుదును అంటున్నాడు ప్రభువు. మానవ పతనంలోని విపత్తుకు కారణం సాతానే. ఈ గుంపు వైపరీత్యం ఎలాంటిదో గ్రహించేటట్లు ప్రభువే మనకు సహాయం చేయును గాక!

ఫలానా తప్పు చేశానని ఈ సంఘంతో ప్రభువు చెప్పలేదు. ఎంత ఆధిక్యత గమనించండి. దోషభరితమైన మనస్తత్వం స్ముర్నలో ఎక్కడా కనిపించదు. దేవునితో అంటు కట్టబడింది. ఉన్నత ప్రమాణాలు కలిగినది. పాపంతో రాజీపడే ధోరణి కనిపించదు. ఉన్నత ప్రమాణాలకై బాధలు సహించినది. లోకానికి చూపించాల్సిన మనోహరమైన సందేశాన్ని సాక్ష్యాన్ని వెల్లడి చేసింది. మన అందరి జీవితాలు యిలానే ఉండాలని ప్రభువు కోరుచున్నాడు.

<u>**వాగ్దానము :**</u> "ఇదిగో మీరు శోధింపబడునట్లు అపవాది మీలో కొందరిని చెరలో వేయింపబోవుచున్నాడు. పది దినములు శ్రమ కలుగును. మరణము వరకు నమ్మకముగా నుండుము. నేను నీకు జీవకిరీటమిచ్చెదను" (10వ). సంఘానికి చెరసాల అనుభవము కావాలని దేవోద్దేశం. ఆ చెర, చెరసాల వివిధ రకాలుగా ఉండొచ్చు, స్ముర్న కాలంలో వాస్తవంగానే విశ్వాసులు చెరసాల పాలయ్యారు. కొందరికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపబడింది. కటిక చీకటిలో బంధించారు. వారలా బాధింపబడుతున్నప్పుడు వారు - ప్రభువైన యేసు నామము నిమిత్తము బంధింప బడుటకు మాత్రమేగాక చనిపోవుటకు సిద్ధంగా ఉన్నామని (అపొ.కా. 21:30) చెప్పారు. చెరసాల తలుపులు తెరచినప్పుడు, "నేను వచ్చునట్లు నీతి గుమ్మములు తీయుడి, నేను వాటిలో ప్రవేశించి, యెహోవాకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదను. ఇది యెహోవా గుమ్మము. నీతిమంతులు దీనిలో ప్రవేశించెదరు" (కీర్తన 119:19-20) అని స్ముర్న సంఘస్తులు కీర్తనలు పాడుతూ చెరసాలల్లోకి వెళ్ళారు. చెరసాల - శ్రమ వారికి ఆహ్లాదకరమైన అనుభవంగా మారిపోయింది. మేమొక్కరమే కాదు ఆయన శిష్యులంతా ఇలా శ్రమలు పాలైనారని ఒక్కొక్కర్ని గుర్తు చేసుకుని ఉంటారు. సంఘ సాంప్రదాయ అపశ్రుతి ప్రకారం మత్తయి ఖడ్గంతో చంపబడ్డాడు. మార్కును మరణించే వరకు వీధిలో లాగి కొట్టారు. లూకాను ఒలీవ చెట్టుకు ఉరివేశారు. మహనీయుడైన యాకోబును (జెబెదయి కుమారుడు) శిరచ్ఛేదనం చేశాడు. అల్ఫయి కుమారుడైన యాకోబును దేవాలయం శిఖరం నుండి క్రిందికి త్రోసి పిమ్మట కర్రలతో మోది చంపారు. ఫిలిప్పును ఉరితీశారు. అంద్రెయను సిలువకు అంటగొట్టారు. సిలువలో నుండి ఆయన ప్రాణం పోయే వరకు ప్రసంగిస్తూనే ఉన్నాడు. తోమాను బల్లెంతో పొడిచి చంపారు.

యూదాను రాళ్ళు రువ్వి చంపారు. కనానీయుడైన సీమోనును సిలువ వేశారు. మత్తయిని మొదట రాళ్ళతో కొట్టి తరువాత శిరస్సును ఛేదించారు. ఆత్మనేత్రాలతో యివన్నీ తళుక్కున మెరసి ఉంటాయి. వాటముందు, వారి ముందు చెరసాల అనుభవాన్ని పోల్చి చూడగా యిది కొరగానిదని పరిగణించి ఉంటారు. క్రీస్తు యేసునందు

సద్భక్తితో బ్రదుకనుద్దేశించువారు హింస పొందుదురు (2తిమోతి 3:12). మరికొన్నిసార్లు చనిపోవడం కన్నా జీవించడమే కష్టతరంగా ఉంటుంది. ప్రియసోదరులారా, అలనాటి హింసలు గమనిస్తే, సంఘాలు కదలింపబడ తాయి. పరిశుద్ధులు మేల్కొంటారు. పాపులు పశ్చాత్తప్తులవు తారు. పరలోకంలో ఆనందం వెల్లివిరుస్తుంది.

పది దినములు శ్రమ కలుగును అయిననూ నమ్మకంగా ఉండుమని ప్రభువు చెప్పుచున్నాడు. పది అను సంఖ్య శోధనను సూచించును. పదిమంది రోమన్ చక్రవర్తుల చేతిలో స్ముర్న సంఘాకలంలోని విశ్వాసులు శ్రమలు పొందారు. 1వ శతాబ్దంలో నీరో-డొమిషియన్, 2వ శతాబ్దంలో ట్రాజెన్, ఇగ్నేషయస్ అనే భక్తుని సజీవ దహనం చేశారు. సజీవ దహనానికి ముందు ఇగ్నేషియస్ "ఎప్పుడు ఆ సంతోష గడియ వచ్చును? నా రక్షకునితో నేనెప్పుడు కలిసియుందును? యింకా ఎంతకాలం నేను కనిపెట్టాలి?" అని అన్నాడట. మార్కస్ అనే చక్రవర్తి హయాంలో పాలికార్పు హతసాక్షి అయ్యాడు. ఈ భక్తుడు 86 సం॥లు స్ముర్న సంఘంలో నమ్మకముగా సేవ చేశాడని చరిత్ర తెల్పుతుంది. చక్రవర్తి యితనిని బంధించి యేసుక్రీస్తును దూషించుమని ఆజ్ఞాపించగా బంధించబడిన పాలికార్పు "86 సం॥ల నుండి నేను యేసును సేవిస్తున్నాను. ఆయన నాకెప్పుడును అన్యాయము చేయలేదు. అట్లు చేసినట్లు నేనెరుగను. అట్టి ప్రాణప్రియుడైన నా రక్షకుని నేనెట్లు దూషించగలను?" అని చెప్పి క్రీ.శ.155లో క్రీస్తు కొరకు హతసాక్షి అయ్యాడు. అక్కడ ఎత్తైన కొండ మీద పాలికార్పు సమాధి యిప్పటికిని కలదని చరిత్రలో చూస్తాం. ఇతడు మరణము వరకు నమ్మకముగా వుండి జీవకిరీటమును సంపాదించుకున్నాడు. సెవరస్ 3వ శతాబ్దంలో చక్రవర్తి 4వ శతాబ్దంలో డయోక్లిషియన్ చక్రవర్తి ఇలా పదిమంది రోమన్ సంఘ క్రైస్తవుల్ని హింసలకు గురి చేశారు. ఇది హతసాక్షుల సంఘం. పదిమంది చక్రవర్తుల శ్రమ పది దినాలకు సాదృశ్యంగా వుంది.

**(సశేషం)**

## బైబిల్ క్విజ్ - 18 జవాబులు

1. దాను గోత్రము (న్యాయా. 18:1)
2. బెన్యామీను గోత్రము వారు (19:16-25)
3. 4 లక్షలు (20:17)
4. తమ కుమార్తెలను పెండ్లికీయ కూడదని (21:1)
5. మహ్లోను, కిల్యోను (రూతు 1:2)
6. బోయజు (2:1)
7. ఆరు కొలలు (3:17)
8. మహ్లోను (4:10)
9. రామతయిమ్సోఫీము (1సమూ. 1:1)
10. హొఫ్నీ, ఫీనెహాసు (2:34)
11. షిలోహులో (3:21)
12. ఎబెనెజెరులో (4:1)
13. అష్డోదునకు (5:1)
14. 7 నెలలు (6:1)
15. 20 సం॥లు (7:2)
16. యోవేలు (8:2)
17. అబీయేలు (9:1)
18. సెల్సహులో (10:2)
19. 3 లక్షలమంది (11:8)
20. ఉరుములను వర్షమును పంపెను (12:18)
21. 30 సం॥లు (13:1)
22. ఈకాబోదు (14:3)
23. 10,000 మంది (15:4)
24. ఏలీయాబు (16:6)
25. సింహము, ఎలుగుబంటి (17:34)

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**పి. చిన్నారావు**

వినుకొండవారివీధి, బాప్టిస్టునగర్, విజయవాడ

సాక్ష్యము

# నేను ప్రభువును వదలలేదు

మాస్వగ్రామము - గుండమాల చిన్నపల్లెపాలెం పుట్టుకతో మేము పట్టపువారము. చేపలు పట్టేవృత్తి.

మా తండ్రి సింగోతు రాఘవులు- మా తండ్రి చిన్నతనమునుండి మద్రాసునకు బకింగ్‌హాం కాలవలో పడవలు లాగేవాడు. వయస్సు మళ్ళిన తర్వాత సముద్రములో చేపలవేట చేసేవాడు. మా అమ్మ లక్ష్మమ్మకు నలుగురు మగపిల్లలు, ఐదుగురు ఆడపిల్లలు నేను మగపిల్లలో ఆఖరివాడిని.నాపేరు రాములు

చిన్నతనములో నన్ను బడికి పంపించారు. మా మాష్టారు అమితముగా అన్యాయముగా నన్ను దండించినందు వలన ఆయనను బూతులు తిట్టి బడిమానేసేను. వయస్సు వచ్చిన తర్వాత మాతండ్రితో వేటకు పోయేవాడిని.

నేను 4వతరగతి చదివేటప్పుడు మా స్మశానము దగ్గర అరమైలు దూరములో గుండమాల ఏటిలో నలుగురితో షికారువెళ్ళి నీటిలో మునిగి పోయాను. నీళ్ళ అడుగునకు వెళ్ళిపోయాను. ఉదయం 9.30 అయింది నేను చచ్చిపోయాననే అనుకొంటాను

ఎర్రని రంగు శరీరము కలిగి -తలమీద కిరీటము పెట్టుకొనిన ఒక స్త్రీ నాదగ్గరకు నవ్వుతూ వచ్చి నాపొట్ట క్రింద చెయ్యి పెట్టి పైకెత్తి నన్ను ఒడ్డున పెట్టింది. ఆమె ఒక దేవదూత అయివుండవచ్చును అని ఈ మధ్య అనుకొంటున్నాను. గుండమాల నుండి షుమారు 70 కిలోల చేపలు కావిడివేసి కొని కొత్తపట్నం తెచ్చి అక్కడ నుండి ఒంగోలు బస్సులో తెచ్చి మార్కెటులో దళారికి అప్పచెప్పేవాడిని.

ఒంగోలులో గొల్లపోతువెంకయ్య అనే చేపల కాంట్రాక్టరుకు చేపలు పట్టెవాడిని. ఆ తరువాత కొంచెం కాలమునకు మత్సకారుల సొసైటీ స్థాపించి దానికి ప్రెసిడెంటుగా చేసేరు.

నాకు మావూరిలోని దండు పోలు వెంకటస్వామి కుమార్తె వెంకటేశ్వరమ్మ అనే అమ్మాయితో వివహాము జరిగినది.

1985లో ఎలక్షన్‌లో ఈతముక్కల గ్రమములో ప్రత్యర్ధి పక్షమువారు నన్ను చంపివేయాలని కట్టేసి సముద్రములో ముంచాలని ప్రయత్నిస్తే దేవుడు ఆ మరణం నుండి తప్పించాడు.

యూనియన్ వారు గుండమాలవచ్చి మోటుమాలలోని మాకు కోళ్ళఫారాలు పెట్టించినందువలనే గుండమాల నుంచి మోటుమాలకు కాపురం మార్చాము కోళ్ళఫారంలో తర్వాత నష్టాలు వచ్చినందున అవి మూసేశాను.

నాకు 5గురు సంతానము 1మగపిల్లవాడు చిన్నప్పటినుండి దేవుడంటే భయము. ఏపనిచేస్తున్నా దేవుడిని తలచుకొనేవాడిని. కాని ఒకానొక సమయములో మావూరి కనకారావు అనే అతను క్రైస్తవమతం తీసికొని ఒంగోలు నుండి తెల్లదొరలను మావూరు తీసుకొచ్చి ప్రార్ధన పెట్టేస్తే - నేను అడ్డుకొన్నాను. మాకు దేవుడు ఉన్నారు మీ దేవుడు మాకొద్దు అన్నాను.

కొంత కాలానికి నాతలలో ఏదో మెదలుతున్నట్లుగా ఉండేది. నెప్పిఏమిలేదు. అయినా భయపడ్డాను. చీరాల నుంచి పరిశుద్దరావుఅనే పాష్టరు మాయింటి ప్రక్కన ఉన్న మందిరముకు వచ్చాడు. ఆసమయములో

మా పెద్దక్క పాటితల్లి సుబ్బులు తనభర్తవలన కష్టాలు పడి యేసయ్యను నమ్ముకొని ప్రార్ధనకి వెళ్తుండేది. ఒక రోజున పరిశుద్ధరావు అనే పాష్టర్ని నాకోసం ప్రార్ధన చేయించటానికి తీసికొని వచ్చింది. ఆపాష్టరుగారు నన్ను ఒంగోలుకొండ మీద సాదు పాస్టరుగారి వద్దకు తీసికొనివచ్చాడు.

ఆసాధుగారు నాసంగతి విన్నాడు. నాకు గుండె నెప్పికూడ ఉన్నది. పాష్టరుగారు యేసును గురించి చెప్పి

– ప్రార్థన చేసారు. ఒక బైబిలు కొనుకొన్నాను

ఇంటికివచ్చి బైబిలు చదువుకొని – యేసయ్య నాలో నెప్పిని తీసివెయ్యి నిన్నే నమ్ముకొంటాను అని ప్రార్థన చేసికొని – సాయంకాలం 7గంటలకు మోటుమాలలోని నాయింటి ప్రక్కన ఉన్న జామచెట్టు క్రింద పండుకొన్నాను. ఇంకా నిద్ర పోలేదు. నేను చూస్తూనే ఉన్నాను ఒక విమానంలాంటిది పైనుండి నేలమీదకు దిగింది. నాదగ్గరగా దిగింది. అందులోనుండి ఇద్దరు తెల్లని దుస్తులు దరించిన 16,17 సంవత్సరముల వయస్సున్న యువకులు నాదగ్గరకు వచ్చి నాఎడమచేతికి ఇంజక్షను చేసి నీజబ్బు ఈరోజుతో బాగయిపోయింది ఇక జాగ్రత్తగా ఉండు అని అదే విమానంలో వెళ్ళిపోయారు.

నాకు స్వస్థత కలిగింది. ఇక ఎప్పుడు బైబిలు పట్టుకోలేదు – పదేళ్ళ వరకు రకరకాల వ్యాపారాలు చేస్తూ – మద్రాసుకు వెళ్తూ– వస్తూఉన్నాను.

రాజకీయాలలో నేడు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా యమ్.పి.లుగా ఉన్నవారితో తిరిగాను. పెద్దపేరు ప్రతిష్ట సంపాదించుకొన్నాను. మా అక్క, పాస్టర్లు నన్ను ప్రార్ధనకు రమ్మని పిలుస్తున్నా రాజకీయాలంటే నాకున్న అభిమానంతో దేవుడికి దూరంగా ఉన్నాను. గవర్నమెంటు దగ్గర నుండి 5 బోట్లు తెప్పించాను.

కొంతకాలం – కొత్తపట్నం కమ్యూనిష్టులతో వైరంగా ఉన్నాను. నేను ఎప్పుడు రెండు కత్తులు బొడ్లో పెట్టుకొని ఉండేవాడిని.

ఒక రాత్రి మూత్రము రాలేదు. ఒంగోలులోని రాంబాబు డాక్టరు దగ్గరికి వెళ్తే – గుంటూరు జనరల్ హాస్పటల్‌కి వెళ్ళమన్నారు. వెలితే రాళ్ళు తీసివేశారు.

నాకు అనారోగ్యము వచ్చినప్పుడు యేసయ్యని నమ్ముకొనేవాడిని – ఆరోగ్యము కలుగగానే దేవుడ్ని వదిలేవాడిని. నావెంబడి ఎప్పుడు యాభైమంది ఉండేవారు

మరలా అదేజబ్బువచ్చింది. మళ్ళీ గుంటూరువెళ్ళి మందులు రాయించుకొని వచ్చాను. జబ్బు సీరియస్ అయింది. ఆరాత్రి పండుకొని నిద్రపోతున్నాను.

రాత్రి 1గంట అయింది. నాజీవతం నాకే వెగటు అయింది. ఎప్పుడూ రాజకీయాల్లో నన్ను ఉపయోగించుకొనిన వారుగాని – నావెంబడి తిరిగి నవారుగాని – నావలన మేలుపొందినవారు వందలమంది ఉన్నారు. వారుగాని నాకెప్పుడు సహాయం చెయ్యలేదు. నాకు ఇంతకముందు సహాయపడిన యేసుప్రభువును నేను వదిలిఉన్నాను. ఇలా ఆలోచిస్తూ నిద్రపోయాను.

బయట పంచలో పండుకొన్నాను – మాపాష్టరుగారు వచ్చి రాములు గారు – లేవండి అని లేపి– రండి రండి అన్నాడు. నేను ఓపిక తెచ్చుకొని లేచి చూస్తే – పాష్టరుగారు కొంచెం ముందుకు పోయాడు. మళ్ళీచూస్తే రోడ్డుమీద ఉన్నాడు– అక్కడికివెళ్తే ప్రక్కనే ఉన్న చర్చీలోకి వెళ్ళాడు. నాకు విసుగువేసింది. అయినా చర్చీలోనికి వెళ్ళిచూస్తే – పాష్టరుగారు గట్టిగా నిద్రపోతున్నాడు. – నేను ఆయనను నిద్రలేపి –కోపంగా ఏంటయ్యా నన్ను నిద్రలేపి నువొచ్చి నిద్రపోతున్నావు అని అడిగాను. అప్పుడు పాష్టరుగారు నేను మిమ్ముల్ని నిద్రలేపలేదండి. అన్నాడు. నాకేమి తెలియదన్నాడు. నేను ఇంటికివచ్చి ఆలోచించాను – పాష్టరుగారు నన్ను నిద్రలేపలేదు. కాబట్టి యేసయ్య నన్ను చర్చిలోనికి నడిపించాడు. ఇవన్ని ప్రభువు నన్ను క్షమించి చేరదీస్తున్నాడు ఇక ఈ రాజకీయాలు – ఈ సాంఘీకసేవలు వదిలి యేుప్రభువునే వెంబడించాలని అనుకొన్నాను. ప్రార్ధన చేసికొని పండుకొన్నాను. తెల్లవారేసరికి నాకు స్వస్థత వచ్చింది. బైబిలు చదవటం మొదలుపెట్టాను. బాప్తీస్మము తీసికొన్నాను. అబ్రహాముగా పేరు మార్చుకొన్నాను. సంఘములో స్థిరముగా నిలబడ్డాను.

కొంతకాలం క్రితం మావల్లెకారులు నన్ను హిందూదేవుళ్ళ పూజకి రమ్మన్నారు. కొలువులుకి డబ్బులు అడిగారు ఎప్పటిలాగే ఈ పూజలు చెయ్యటానికి నాయకత్వం వహించమన్నారు.

అందుకు నేను ఒప్పుకోలేదు. నేను యేసు ప్రభువును నమ్ముకొన్నాను. ఆయన నాకొరకు సిలువలో మరణించి లేచిన దేవుడు నన్ను బ్రతికించిన దేవుడన్నాను.

ఇంతకు ముందు మేమందరము కలసి వేసిన సబుకు తోటలో మాకు రావాలసిన భాగం 3లక్షల రూపాయలు ఇవ్వమన్నారు. తర్వాత 70 మంది నాయింటిమీదకు వచ్చారు. కొట్టారు. చంపటానికి ప్రయత్నాలు చేసారు. అయినా నేను ప్రభువును వదలలేదు.

ఇవన్నీ నన్ను ప్రభువు ప్రేమనుండి ఎడబాపలేవు.

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

## విద్యను అమ్ముతున్న కాలంలో విద్యాదానం చేస్తున్న

# I.E.R.F. మిషన్ విద్యా సంస్థలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపబడిన సంస్థ)

**కృపాదానంగారి వీధి, క్లౌపేట, 6వ లైను, ఒంగోలు**

బీద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు గొప్ప సదవకాశం. త్వరపడండి I.E.R.F. సంస్థ గత 40 సంవత్సరాలుగా పేద బడుగువర్గాల అభ్యున్నతి కొరకు విద్యారంగంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి రెసిడెన్షియల్ స్కూల్‌తో సమానంగా విద్యను అందిస్తుంది. గత ఏడాది మా U.C.L.I. స్కూల్‌నందు 10వ తరగతిలో 95% ఉత్తీర్ణత. అంతమాత్రమే కాక ఈ సంస్థలో చదివిన వారికి దైవానుగ్రహం కూడా మెండుగా లభిస్తుందని చెప్పటానికి ఋజువు ఈ సంస్థలో చదివిన వారు అనేకులు విదేశాలలో (అమెరికాలో) ఉద్యోగం చేస్తూ ఉండటం గమనార్హం. ఈ విధంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతిని సాధిస్తున్న I.E.R.F. సంస్థ గత 4 సంవత్సరాలుగా 1,2,3 తరగతులకు ఉచితముగా కాన్వెంట్ స్థాయిలో ఇంగ్లీషు బోధన మొదలుపెట్టింది. పై క్లాసుల వారికి కూడా అతి తక్కువ ఫీజుతో ఇంగ్లీషు బోధన కలదు. టీచర్స్ ఇంగ్లీషు మాతృభాష అయిన ఇంగ్లండు దేశపు వారు కావటం ఇంకొక ప్రత్యేకత. మా స్కూలునందు ఎలిమెంటరీ పిల్లలు సైతం ఇంగ్లీషు మాట్లాడము గమనార్హం.

### మా స్కూలు ప్రత్యేకతలు

- ★ అన్ని తరగతుల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.
- ★ 1,2,3 తరగతులకు ఇంగ్లండ్ దేశపు యువతులచే ఉచిత ఇంగ్లీషు బోధన.
- ★ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం మరియు ఒక జత యూనిఫాం ఉచితంగా ఇవ్వబడును.
- ★ విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కలదు.
- ★ కులమత సంబంధం లేదు ఎవరైనా బీదవారుగా ఉన్నవారు మా హాస్టల్‌లో చేరవచ్చును.
- ★ ఎలిమెంటరీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం మరియు ఫ్యామిలీ సపోర్టు కలదు.
- ★ స్కూల్లో చదువుతున్న పిల్లల తలిదండ్రులకు కష్టకాలంలో వైద్య, ఆర్థిక సహాయము కొరకు కృషి చేయబడును.
- ★ బాలికలకు ఉచితంగా G.N.M. నర్సింగ్, INTER శిక్షణ ఇప్పించబడును.
- ★ B.Sc. నర్సింగ్ వారికి స్వల్ప ఫీజులతో శిక్షణ.
- ★ 1 నుండి 10 వరకు అడ్మిషన్లు మే 6 నుండి మొదలగును. సీట్లు పరిమితం విచ్చేయండి.

మీ పిల్లల చక్కని భవిష్యత్ కొరకు, ఉన్నత విద్యాబుద్ధుల కొరకు, చక్కని క్రమ శిక్షణ కొరకు ఐ.ఈ.ఆర్.ఎఫ్. సంస్థలో చేర్పించండి.

సీట్లు పరిమితం కనుక ముందుగా సీటు రిజర్వ్ చేసుకొనవలెను.

ఇట్లు

**రెవ.డా॥ జోసఫ్ కొడవటికంటి,** కరస్పాండెంట్

సెల్ : **9676340371, 9704255416**

# పరలోకము అనగానేమి? 2

వీటన్నింటిని బట్టి పరలోకము దేవునిచే ఏర్పాటు చేయబడిన ఆకాశ విశాలములో వున్నది అని గమనించ వలెను.

**పరలోకము ఏ విధంగా వుంది? పరలోక వర్ణము తెల్పుట**- అపొస్తలుడైన యోహానుగారు ఆత్మవశుడై తాను చూచి అనుభవించిన స్వీయ అనుభవాలను ప్రక.4:2-11లో పరలోకమును గూర్చి విపులంగా వ్రాసి యున్నారు. ఆ అపొస్తలుడు వ్రాసి యిచ్చిన వివరములను తెలుసుకొనిన పరలోక వివరములన్నియు తెలియనగును. ప్రక.4:2-11 లోని పరలోకమును గూర్చిన ముఖ్య అంశములు.

1. పరలోకమందు ఒక సింహాసనము కలదు. దానిలో ఒకరు ఆసీనులై యుండిరి. ఇది యేసుక్రీస్తు వారై యుందురు.

2. ఆసీనుడైయున్న వ్యక్తి దృష్టిని సూర్యకాంత పద్మరాగము లను పోలియున్నాడు. మరకతమువలె ప్రకాశించు ఇంద్ర ధనుస్సు సింహాసనమును ఆవరించి యుండెను.

3. ఆ సింహాసనము చుట్టూ 24 సింహాసనములు కలవు. వానిలో తెల్లని వస్త్రములు ధరించి సువర్ణ కిరీటమును ధరించిన 24గురు పెద్దలు ఆసీనులై యుండిరి.

4. సింహాసనము నుండి ఉరుములు, మెరుపుల ధ్వనులు బయలు వెళ్ళుచున్నవి.

5. సింహాసనము ఎదుట ఏడు దీపస్తంభములు ప్రజ్వలించు చున్నవి. అవి దేవుని ఏడు ఆత్మలు.

6. సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజువంటి సముద్రముండెను.

7. సింహాసనమునకు మధ్యను, చుట్టూను ముందు వెనుక కన్నులు కలిగిన నాలుగు జీవులు కలవు. వానిలో ఒకటి సింహమువంటిది. రెండవది దూడవంటిది. మూడవది మనుష్యుని ముఖమువంటి ముఖము గలది. నాల్గవది ఎగురుచున్న పక్షిరాజు వంటిది. ప్రతి జీవికి ఆరేసి రెక్కలున్నవి. రెక్కలు లోపలును వెలుపలును కన్నులు కలిగి యున్నవి.

8. ఆ జీవులు భూత, వర్తమాన భవిష్యత్ కాలములో నుండు దేవుడు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు అని మానక రాత్రింబ వళ్ళు చెప్పుచుండిరి. దేవునికి ఆసీనుడైయుండి యుగ యుగములు జీవించు చున్నవానికి మహిమ, ఘనతయు కల్గునుగాక అని కీర్తించు చుండిరి.

9. ఆసీనులైయున్న ఇరువది నలుగురు పెద్దలు యుగ యుగములు జీవించుచున్న వానికి నమస్కారము చేసి ప్రభువా-మాదేవా నీవు సమస్తమును సృష్టించితిని నీ చిత్తమునుబట్టి అవి యున్నవి. నీవే మహిమ ఘనత ప్రభావ ములు పొందనర్హుడవని చెప్పుచూ తను కిరీటములను దేవుని సింహాసనము ఎదుట వేసిరి.

పరలోకమును గూర్చి అక్కడనున్న దేవుని వెలుగు కెరూబులు, సెరావుల గూర్చి, ఇరవైనలుగురు పెద్దలను గూర్చి గాజువంటి సముద్రమును గూర్చి అక్కడ జరుగు స్తుతి ఆరాధన గూర్చి ప్రత్యక్షంగా చూసి గ్రహించి యోహాను గారు మనకు తెలిపిన పరలోక సత్యము

పరిశుద్ధుడైన దేవుడు దూత గణముల చేత స్తుతించ బడువాడు, పరలోకములోను, భూమిపైనను సార్వభౌమాధి కారముగల మన ప్రియ ప్రభువు ఆసమస్త వైభవమును విడిచి మనుష్యులతో వుండుటకు ఇష్టపడుచున్నాడు దీనిని బట్టి దేవుడు మనిషిని ఎంతగా ప్రేమించుచున్నాడో మనము గ్రహించ వచ్చును. ప్రక.21:3-4. ఇదిగో దేవుని నివా సము మనుష్యులలో కూడ వున్నది ఆయన వారితో కాపుర ముండును, వారాయన ప్రజలకై యుందురు. దేవుడు తానే వారి కన్నుల ప్రతి భాష్పబిందువును తుడిచివేయబడును.

పరిశుద్ధుడైన దేవుడు, పాపియైన ఒక మనిషితో కలిసి

జీవించుటకు యిష్టపడుట ఎంత గొప్ప విషయము దేవుడు మనతో వుండుటకు యిష్టపడుతున్నాడు చేర్చుకొనే దానికి మనము ఆశ కలిగి యున్నామా? లేదా? దేవునికి మన హృదయములో చోటిస్తే మన బ్రతుకునే మార్చేస్తారు. దేవున్ని హృదయములోనికి చేర్చుకుందాము.

**2. పరలోకమునకు ఎవరు అర్హులు? అనర్హులు ఎవరు?**

పరలోకము అనేది పరశుద్ధమైన స్థలము–ఇది సిద్ధపరచ బడిన స్థలము– సిద్ధ పడిన వారికి, పరిశుద్ధులకు మాత్రమే యిందులో ప్రవేశము వుంటుంది. అని మొదటిగా గమ నించవలెను.

**పరలోకమునకు అర్హతలు కలిగినవారు:–** ఈ క్రిందనుదహ రించబడిన అర్హతలు కలిగినవారు మాత్రమే పరలోకము చేరగలరు ప్రవేశింపగలరు. 1) మత్త.5:3. ఆత్మ విషయమై దీనులైన వారు దన్యులు పరలోక రాజ్యము వారిది. 5:10 నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు పరలోక రాజ్యము వారిది. కొండ మీది ప్రసంగములు యేసు ప్రభువువారే చెప్పిన మాటలు మనము తెలుసుకొంటు న్నాము. ఆత్మ విషయములో దీనత్వముగల వారును నీతి నిమిత్తము హింసనొందువారు పరలోకము చేరుతారు దుర్నీతిపరులు ఆత్మను ఆర్పుతున్నవారు పరలోకము చేరలేరు. 2) మత్త.25:34. నా తండ్రి చేత ఆశీర్వదించ బడిన వారలారా రండి లోకము పుట్టినది మొదలుకొని, మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి. దేవుని కొరకు తమను తాము ప్రత్యేకపరుచుకొని, ఒక ప్రత్యేకమైన, పరిశుద్ధమైన జీవనము సాగిస్తూ ప్రేమ, విశ్వాసము, నిరీక్షణలో లోపము లేని వారైయుండి దేవుని మీదనే ఆనుకొని జీవించు వారు వీరు ఆశీర్వదింపబడిన వారు పరలోక ప్రవేశము గలవారు. 3) రోమా.8:17. మనము దేవుని పిల్లలమైతే వారసులము. అనగా దేవుని వారసులము క్రీస్తుతో కూడ ఆయన మహిమ పొందుటకు, ఆయనతో శ్రమపడిన ఎడల, క్రీస్తుతో కూడా వారసులము. యోహాను.1:12 తనను ఎందరు అంగీకరించెదరో వారికందరికి అనగా ఆయన నామమందు విశ్వాసముంచు వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్ర హించెను. దేవునియందు విశ్వాసముంచిన వారే దేవుని కుమారులు. ఆ దేవుని కుమారులుగాను కుమార్తెలుగాను తీర్చబడిన వీరే పరలోకములో ప్రవేశింపగలరు. 4) హెబ్రి. 12:22–23 "ఇప్పుడైతే సీయోను కొండకును జీవముగల దేవుని పట్టణమునకు అనగా పరలోకపు యెరూషలేమునకు లేపేల దూతల యెద్దకు జేష్ఠుల సంఘమునకు క్రొత్త నిబంధ నకు మధ్యవర్తియైన యేసునొద్దకు వచ్చి యున్నాము. వీరు విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచూ వారి ఎదుట వుంచబడిన పరుగు పందెము (విశ్వాసయాత్ర)లో నెగ్గి జయము పొంది, దేవునిచే ఎన్నిక చేయబడిన వారుగా గుర్తించాలి. వీరు పరలోకములో ప్రవేశించినారు.

యోహా.3:3 అందుకు యేసు ఒకడు క్రొత్తగా జన్మించి తేనే గాని దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయ ముగా చెప్పుచున్న ననెను.

యేసు ప్రభువు వారు నికోదేముతో చెప్పిన మాటలు. "You must be born again"–నూతన జన్మ అనుభవము గల వారు పరలోకములో చేరగలరు.

6) 1పేతు.1:5 కడవరి కాలమందు బయలుపర్చబడుటకు సిద్ధముగానున్న రక్షణ మీకు కల్గునట్లు, విశ్వాసము ద్వారా, దేవుని శక్తి చేత కాపాడదు మీ కొరకు ఆ స్వార్ధము పరలోక మందు భద్రము చేయబడియున్నది. యోహా.6:47 విశ్వాస ముంచువాడే నిత్యజీవము గలవాడు.

7) ప్రక.7:14. గొఱ్ఱెపిల్ల రక్తములో తమ వస్త్రములు ఉతుక్కొని వాటిని తెలుపు చేసుకొనిరి. అందువలననే వారు దేవుని సింహాసనము ఎదుట నుండి, రాత్రింబవళ్ళు ఆయన ఆలయములో ఆయనను సేవించుచున్నారు.

8) 1థెస్స.4:17 ఆ మీదట సజీవులై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువు నెదుర్కొనుటకు మేఘముల మీద కొనిపోబడుదము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ నుందుము

**(సశేషం)**



# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## బైబిల్ క్విజ్ - 19

1సమూయేలు 18 నుండి 2సమూయేలు 11 వరకు

1. యోనాతాను యొక్క ప్రాణ స్నేహితుడు ఎవరు?
2. సౌలు దావీదును చంపదలచినప్పుడు దావీదు పారిపోయి ఎక్కడికి వెళ్ళెను?
3. యోనాతాను నుండి వర్తమానము కొరకు ఎదురు చూచుటకు దావీదు పొలములో ఎక్కడ దాగెను?
4. నోబులోని యాజకుని పేరు ఏమిటి?
5. యాజకుడైన అహీమెలెకును చంపినది ఎవరు?
6. దావీదు కెయిలా నుండి పారిపోయి ఏ అరణ్యములో నివసించెను?
7. సౌలును చంపుటకు అవకాశం వచ్చినా దావీదు ఎందుకు చంపలేదు?
8. సమూయేలు మృతినొందినప్పుడు అతనిని ఎక్కడ పాతిపెట్టిరి?
9. జీఫు అరణ్యములో ఉన్న దావీదును వెదకుటకు సౌలు ఎంతమందితో వెళ్ళెను?
10. గాతు రాజైన ఆకీషు తండ్రి పేరు ఏమిటి?
11. కర్ణ పిశాచముగల దానిని ఎక్కడ కనుగొనిరి?
12. ఆకీషు దావీదును యుద్ధమునకు తీసుకొని వెళ్ళక వెనుకకు వెళ్ళమని ఎందుకు చెప్పెను?
13. సిక్లగు మీదకి దండెత్తి వచ్చి దానిని తగులబెట్టినది ఎవరు?
14. యుద్ధములో హతులైన సౌలు కుమారుల పేర్లేమిటి?
15. సౌలు, యోనాతానును గూర్చి దావీదు వ్రాసిన ధనుర్గీతము ఏ గ్రంథములో లిఖింపబడినది?(2సమూ.)
16. దావీదు హెబ్రోనులో యూదా వారిని ఏలిన కాలమెంత?
17. అదోనీయా తల్లి పేరు ఏమిటి?
18. యోనాతాను కుమారుని పేరు ఏమిటి?
19. తూరు రాజు పేరు ఏమిటి?
20. దేవుని మందసమును దావీదు ఎక్కడ నుండి తీసికొని వచ్చెను?
21. యెహోవాకు మందిరము కట్టించు విషయమై దావీదు ఏ ప్రవక్తతో మాట్లాడెను?
22. సోబా రాజు పేరు ఏమిటి?
23. అమ్మోను రాజైన హానూను తండ్రి పేరు ఏమిటి?
24. యెష్షయి పెద్ద కుమారుని పేరు ఏమిటి?
25. ఏ కాలంలో రాజులు యుద్ధమునకు బయలుదేరుదురు?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.